


విశాఖ ఓటర్లు ఎవరి వైపు?

- పోటీ రసవత్తరం
- ఎంపీ అభ్యర్థులుగా కూటమి నుంచి ఎం.శ్రీభరత్, వైసీపీ తరపున బొత్స ఝాన్సీ
- అసెంబ్లీ స్థానాల్లో ముఖాముఖి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ పాలనపై ఓటర్లు తీర్పు ఇచ్చే సమయం వచ్చింది. రాష్ట్రంలో అతి పెద్ద నగరం విశాఖపట్నం. గత ఐదేళ్లలో పరిశ్రమలేవీ రాకపోగా...ఉన్నవి వెళ్లిపోతున్నాయి. భవన నిర్మాణ రంగం కుదేలైంది. కూలీలకు పనులు లేవు. భూములకు రక్షణ లేదు. ప్రశాంత విశాఖ గంజాయి, డ్రగ్స్ కేంద్రంగా మారిపోయింది. పర్యాటక అభివృద్ధి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఓటు ఎవరికి వేయాలో ప్రజలే ఆలోచించుకోవాలి. ఓటుతోనే ఐదేళ్ల భవిష్యత్తును రూపొందించుకోవాలి.



ఎం.శ్రీభరత్



బొత్స ఝాన్సీ

ఎంపీ ఎన్నికే కీలకం

జిల్లాలో విశాఖపట్నం లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు (ఒకటి పాక్షికం...పెందుర్తి) జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రధానంగా కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ), వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉంది. విశాఖపట్నంలో పాగా వేయాలని ఎప్పటి నుంచో జగన్ యత్నిస్తున్నారు. 2014 ఎన్నికల్లోనే తల్లి విజయలక్ష్మిని విశాఖ ఎంపీగా పోటీ చేయించారు. ఆమె బీజేపీ అభ్యర్థి కంభంపాటి హరిబాబు చేతిలో ఓడిపోయారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి మనుమడు, గీతం అధ్యక్షులు ఎం.శ్రీభరత్ పోటీ చేశారు. వైఎస్ఆర్ సీపీ తరఫున ఎంవీవీ సత్యనారాయణ, బీజేపీ తరఫున పురందేశ్వరి, జనసేన తరఫున మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ పోటీ చేశారు. చతుర్ముఖ పోటీలో శ్రీభరత్‌పై సుమారు నాలుగు వేల ఓట్ల తేడాతో ఎంవీవీ సత్యనారాయణ గెలిచారు. జనసేన అభ్యర్థికి సుమారు 2,75,000 లక్షల ఓట్లు లభించడంతో శ్రీభరత్ ఓటమి పాలయ్యారని, లేనిపక్షంలో లక్ష ఓట్లకుపైగా మెజారిటీతో గెలుపొంది ఉండేవారనే రాజకీయ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమైంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కూటమి అభ్యర్థిగా మళ్లీ శ్రీభరతే ఎంపీగా పోటీ చేస్తున్నారు. వైఎస్ఆర్‌సీపీ తరఫున మంత్రి బొత్స సత్యనారాయణ భార్య, మాజీ ఎంపీ ఝాన్సీ పోటీ పడుతున్నారు. ఇంకా బరిలో కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నా ప్రధానంగా వీరి మధ్యే పోటీ. శ్రీభరత్ విద్యావంతుడు. ఉధృతంగా ప్రచారం చేశారు. గెలిస్తే ఏమి చేస్తానో ప్రజలకు వివరంగా చెప్పారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలుపుదల, యువతకు ఉపాధి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం, ... మిగతా 6వ పేజీలో

ఓటుకు వేళాయె..!





ఎన్నికల సామగ్రి తీసుకువెళ్తున్న సిబ్బంది

నేడే సార్వత్రిక ఎన్నికల పోలింగ్

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ...
- ఆరు గంటలకు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారికి కూడా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం
- విస్తృత ఏర్పాట్లు
- జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. జిల్లాలో గల 20,12,373 మంది ఓటర్ల కోసం 1,991 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో అత్యధికంగా విశాఖ పార్లమెంటు నియోజక వర్గానికి 33 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో మూడు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నారు. అలాగే ఏడు అసెంబ్లీ స్థానాలకు 101 మంది పోటీ పడుతున్నారు. అత్యధికంగా విశాఖ దక్షిణ నియోజక వర్గంలో 16 మంది పోటీపడుతుండడంతో అక్కడ రెండు ఈవీఎంలు పెడుతున్నారు. భీమిలి, విశాఖ ఉత్తర నియోజక వర్గాల్లో 15 మంది వంతున, విశాఖ తూర్పు, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో 14 మంది వంతున పోటీలో ఉండగా...అతి తక్కువగా విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి 13 మంది బరిలో ఉన్నారు. ఇంకా రాష్ట్రంలో మూడు లక్షల మందికి పైగా ఓటర్లున్న ఐదు అసెంబ్లీ స్థానాల్లో మూడు విశాఖ జిల్లాలోనే ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,63,013 మంది ఓటర్లు ఉండగా, గాజువాకలో 3,33,611, పెందుర్తిలో 3,07,545 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచారు.

పార్లమెంటు నియోజక వర్గానికి 33 మంది పోటీ చేస్తుండడంతో అధికారులు మూడు ఈవీఎంలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ కారణంగా ఓటు వేయడానికి కాస్త సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో 800 మంది ఓటర్లు దాటిన బూత్‌లలో ఓటింగ్ ఆలస్యమవుతుందని భావించిన అధికారులు, కేంద్రాల ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో గల ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు విశాఖ జిల్లాలో ఉండగా...ఒకటి (ఎస్.కోట) విజయనగరం జిల్లాలో ఉంది. విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఓటర్లు 19,27,303 మంది ఉండగా పురుషులు 948403, మహిళలు 9,78,785 మంది, ట్రాన్స్‌జండర్లు 115 మంది ఉన్నారు. వీరికోసం 1,962 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 13,069 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 2,183 మంది పీవోలు, 2,192 మంది ఏపీవోలు, 8,694 ఓపీవోలు ఉన్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 22 మంది ... మిగతా 6వ పేజీలో



సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మొత్తం ఓటర్లు	20,12,373
పురుషులు	9,92,768
మహిళలు	10,19,487
ఇతరులు	118
ఎన్నికల సిబ్బంది	13,069 మంది
పోలింగ్ కేంద్రాల సంఖ్య	1,991
క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాలు	502
మోడల్ పోలింగ్ కేంద్రాలు	11
బ్యాలెట్ యూనిట్లు (ఈవీఎంలు)	9,627
కంట్రోల్ యూనిట్లు	4,681
మొత్తం పోలీసులు	5,023
పార్లమెంటు నియోజకవర్గ బరిలో అభ్యర్థులు	33 మంది
ఏడు అసెంబ్లీ స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులు	101 మంది



ఓటుకు నోటు కోసం...!

- వైసీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ కార్యాలయాన్ని చుట్టుముట్టిన ఓటర్లు
- గాజువాక వైసీపీ అభ్యర్థి ఇంటికి మహిళలు

- మెయిన్ ఎడిషన్‌లో...

రూ.1.54 కోట్లు నగదు పట్టివేత

- కారు వదిలేసి పరారైన వ్యక్తులు

- మెయిన్ ఎడిషన్‌లో...



స్వేచ్ఛగా ఓటేయండి: కలెక్టర్

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సోమవారం జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. గత (2019) ఎన్నికల్లో జిల్లాలో 66 శాతం పోలింగ్ జరిగిందని, అయితే ఈ పర్యాయం ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని 80 శాతానికి పెంచాలని కోరారు.

ఓటు వేయడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లే ఓటర్లు తప్పనిసరిగా ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకునివెళ్లాలి. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసిన పాస్ బుక్, పాన్ కార్డు, జనగణన ఆధారంగా జారీచేసిన స్మార్ట్ కార్డ్, ఫొటో ఉన్న పెన్షన్ కార్డు...వీటిలో ఏదో ఒకటి తీసుకుని వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

ఓటరు స్లిప్ పొందండి ఇలా..

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రజలందరికీ ఇప్పటికే ఓటరు స్లిప్‌లను బీఎల్వోలు ఇంటింటికీ అందించారు. ఇప్పటికీ ఓటరు స్లిప్ అందని వారంతా తమ మొబైల్ ఫోన్‌లో ఓటరు స్లిప్పులు పొందేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ఓటర్లు చేయాల్సిందలా 1950 నెంబర్‌కు మెసేజ్ చేయడమే. ఇలా మెసేజ్ చేసిన 15 సెకెన్లలోనే ప్రతి ఒక్కరూ ఓటరు స్లిప్ పొందుతారు. మెసేజ్ చేసే సందర్భంలో ముందుగా 'ఈసీఐ అని టైప్ చేసి, స్పేస్ ఇచ్చి మీ ఓటరు ఐడీ నంబరును టైప్ చేయాలి. ఆ తరువాత 1950కు సెండ్ చేస్తే మీ ఓటరు స్లిప్ మీసెల్‌కు చేరుతుంది. ఇందులో మీ పేరు, సీరియల్ నంబరు, మీ ఓటు ఎక్కడ ఉంది, బూత్ నంబరు, ఏరియా, పోలింగ్‌స్టేషన్ తదితర వివరాలన్నీ క్షణాల్లో మీ ముందుంటాయి. మరింకెందుకు ఆలస్యం మీకు ఓటరు స్లిప్ అందకపోతే వెంటనే మొబైల్ ద్వారా తెలుసుకోండి.

వైసీపీ ఆఖరి అస్త్రం

- మహిళా సంఘాల సభ్యులకు డబ్బులు ఎర
- బ్యాంకు బుక్ తీసుకువస్తే ఖాతాల్లో జమ చేస్తామని హామీ
- వాట్సాప్‌లో ఆర్పీ వాయిస్ మెసేజ్
- కేకే రాజుకు ఓటు వేయాలని వినతి

విశాఖపట్నం, మే 12: ఇప్పటివరకు తాయిలాలు, డబ్బులతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేసిన వైసీపీ నాయకులు పోలింగ్ రోజున కూడా మహిళలకు డబ్బు పంపిణీ చేస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ రిసోర్స్ పర్సన్ వాయిస్ మెసేజ్ హల్‌చల్ చేస్తోంది. అందులో మహిళా సంఘాల సభ్యులు సోమవారం ఉదయం 8 గంటలకు సంఘం బ్యాంకు పాస్ పుస్తకాలను తనకు ఇవ్వాలని కోరింది. డబ్బు పంపిణీకి అవకాశం లేకపోవడంతో నేరుగా బ్యాంకు ఖాతాలోనే జమచేస్తారని నేతలు చెప్పారని, పాస్‌బుక్‌లు అందిస్తే డబ్బులు జమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చింది. ఆ తరువాతే ఓటు వేసేందుకు వెళ్లాలని కూడా సూచించింది. అలాగే, ఉత్తరంలో వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేకే రాజుకు ఓటు వేయాలని కోరింది.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నిలకు యంత్రాంగం ఏర్పాటు పూర్తి చేసింది. రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వెయ్యి ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. మూడు, నాలుగు పోలింగ్ బూత్‌లు ఒక చోట ఉన్న దగ్గర వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్ వద్ద ఆశా కార్యకర్త ఉదయం ఏడు నుంచి సాయంత్రం వరకు సేవలందిస్తారు. ఆమెతోపాటు టీబీ సిబ్బంది, ఫార్మాసిస్టులు ఉంటారు. కేంద్రాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్‌తోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే ప్రాథమిక చికిత్స అనంతరం దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశామని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

నేడు విశాఖ-బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మే 12: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, బ్రహ్మపూర్ మధ్య సోమవారం ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలును ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు సోమవారం (13న) ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి సోమవారం (13న) సాయంత్రం 6.30కు బ్రహ్మపూర్‌లో బయలుదేరి రాత్రి 11.15 కు విశాఖ చేరుతుంది.

విశాఖ, కోరాపుట్‌కు అదనపు కోచ్‌లు

విశాఖ, కోరాపుట్ మధ్య నడుస్తున్న రైలు సర్వీసులకు రెండు అదనపు జనరల్ కోచ్‌లు జత చేస్తున్నామని పేర్కొన్నారు.



సౌత్ పరిధి కలెక్టరేట్ సమీపంలో పోలింగ్ కేంద్రంలో సిబ్బంది



ఆర్పీపేట స్కూల్ పోలింగ్ కేంద్రం ఎదుట అధికారులు, పోలీసులు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 56వ వార్డులో ఆర్పీ పేట, కంచరపాలెం పాఠశాలలో కేంద్రాలు
- 48వ వార్డులో రాంజీ ఎస్టేట్, స్టీల్‌సిటీ, పాలిటెక్నిక్ కళాశాలలు..

కంచరపాలెం, మే 12: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో జీవీఎంసీ 47,48,54, 56,57 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. 47వ వార్డు పరిధి ఓటర్లు స్థానిక రాంజీ ఎస్టేట్ పాఠశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. 48వ వార్డునకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను ఊర్వశి జంక్షన్ స్టీల్ సిటీ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బర్మాక్యాంప్‌లోని కె.కాలనీ స్కూల్లో ఏర్పాటు చేశారు. 54వ వార్డుకు సంబంధించి కప్పరాడ హైస్కూల్, జ్యోతి నగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. 56వ వార్డు గవరకంచరపాలెం, ఆర్పీపేట, చాకలిగెడ్డ, దయానంద నగర్ గ్రామాల ప్రజలకు మెట్టు వద్దపై ఆర్పీపేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. 57వ వార్డులో సుభాష్ నగర్, ఆశవానిపాలెం, ఐటీఐ జంక్షన్ సచివాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నీ పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది సోమవారం ఉదయం 7గంటల నుంచి ప్రారంభం కానున్న పోలింగ్ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

అక్కయ్యపాలెం పరిధిలో..

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గం పరిధి గ్రేటర్ 26, 42, 43, 44, 45, 46వ వార్డుల్లో సోమవారం జరిగే ఎన్నికల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు సిద్ధం చేశారు. ఇప్పటికే పోలింగ్ అధికారులు కేంద్రాలకు చేరుకున్నారు. 26వ వార్డులో 21 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 42వ వార్డులో 5 పోలింగ్ కేంద్రాలు, 9 పోలింగ్ బూత్‌లు, 10,300 మంది ఓటర్లు ఉన్నారు. 44వ వార్డులోబూత్‌లు 17 ఏర్పాటుచేయగా, 17500 మంది ఓటర్లు ఉన్నారు. 45వ వార్డులో 9వేల మంది ఓటర్లు ఉండగా, 11 పోలింగ్ బూత్‌లున్నాయి. 46వ వార్డులో 3 పో లింగ్ కేంద్రాలు, 11 బూత్‌లు, 13990 మంది ఓటర్లు ఉన్నారు.

దక్షిణ నియోజకవర్గంలో....

గ్రేటర్ 27వ వార్డులో 5 పోలింగ్ కేంద్రాలు, 18 బూత్‌లు, 16 వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారు 42వ వార్డులో 11 బూత్‌లు, 14 వేల మంది ఓ టర్లు ఉన్నారు.

సీతమ్మధార పరిధిలో..



నక్కవానిపాలెం పాఠశాలలో ఓటర్ల జాబితాలు సరిచూసుకుంటున్న ఉద్యోగులు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి డి.అఖిల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. సోమవారం ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వీలుగా వసతులు సమకూర్చారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్ లో, నక్కవానిపాలెం, మద్దిలపాలెం జీవీఎంసీ స్కూల్, సీతంపేట మధురానగర్ స్కూల్ త దితర స్కూల్స్‌లో పోలింగ్ బూత్‌ల్లో విధులు నిర్వహించే సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు వీలుగా సామగ్రిని ఆదివారం తరలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులకు ముమ్మరంగా బం దోబస్తు ఏర్పాటు చేశారు.

51, 49వ వార్డుల పరిధిలో..

మురళీనగర్; మాధవధార, మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీల్లోని పోలింగ్ కేం ద్రాలను అధికారులు సిద్ధం చేశారు. 51వవార్డు పరిధిలోని 17 పోలింగ్ బూత్‌లను ఆర్పీఏ కార్యాలయం, ఆర్అండ్‌బీ ఆఫీసు, జీఎస్ఐ కార్యాలయంలో రెడీ చేశారు. మాధవధార ఉడాకాలనీ కమ్యూనిటీ హాలులో తాత్కాలిక పార్టిషన్‌లతో కేం ద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల



మాధవధారలో పోలింగ్ క్యాబిన్‌లో సీసీ కెమెరాలు, ఇతరత్రా ఏర్పాట్లు

నిఘా, తాగునీరు, ఓటర్లు వేచి ఉండేలా టెంట్లను జీవీఎంసీ అధికారులు, వార్డు సచివాలయ ఎమినిటీస్ సిబ్బంది అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 49వవార్డులో ఊర్వశి జంక్షన్ పాలిటెక్నిక్ కాలేజీ, బర్మాక్యాంప్ జీవీఎంసీ స్కూల్స్, కమ్యూనిటీ హాల్స్‌లో పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు.ఉదయం 5;30 గంటలకు మాక్ పోలింగ్ తర్వాత 7 గంటల నుంచి ఓటర్ల తీర్పుని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు.

ఓటర్లకు డబ్బు పంపిణీలో గలాటాలు

- వన్‌టౌన్ పరిధిలో వైసీపీ నాయకులతో వాగ్వాదాలు

జగదాంబ కూడలి, మే 12: ఓటర్లకు నగదు పంపిణీలో దక్షిణ నియోజవర్గంలో వైసీపీ వార్డుస్థాయి నాయకులతీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఓటర్ జాబితాల్లో పేర్లు ఉన్న వారికీ నాయకులు ఆ పార్టీ అధిష్ఠానం, అభ్యర్థి పంపిణీకోసం ఇచ్చిన డబ్బును అందించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఇంట్లో పది మంది ఓటర్లు ఉంటే ఒక్కరిద్దరికి మాత్రమే డబ్బులు అందించి మిగతా సొమ్మును గోల్‌మాల్ చేశారని పలువురు చెబుతున్నారు. జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ వరకు ఉన్న ప్రధాన వార్డుల్లో వైసీపీ వార్డు నాయకులు, జీవీఎంసీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఓటర్లకు ఇవ్వాల్సిన సొమ్ము కాజేయడంతో తాము వైసీపీకి ఓటేసేదిలేదని బహిరంగంగానే చెబుతుండడం గమనార్హం. అనేక వార్డుల్లో ఓటర్ల నగదు చెల్లింపు లో లోపాలు పోలింగ్‌లో అధికార పార్టీ అభ్యర్థిపై ప్రభావం చూపుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

47వ వార్డులో నాయకుల ఇళ్ల ముట్టడి



కప్పరాడలో టీడీపీ అధ్యక్షుడి ఇంటి వద్ద గుమిగూడిన ఓటర్లు

అక్కయ్యపాలెం, మే 12: గ్రేటర్ 47వ వార్డు రాంజీఎస్టేట్, కప్పరాడ ప్రాంతాల్లో తమకు ఎన్నికలకు సంబంధించిన నగదు పంపిణీ చేయలేదని వార్డు టీడీపీ అధ్యక్షుడు చెంగల శ్రీనుబాబు, బీజేపీ అధ్యక్షుడు గునుపూడి అరుణ్‌కుమార్‌ల ఇళ్లను ఓటర్లు ఆదివారం రాత్రి చుట్టుముట్టారు. కొంతమందికి నగదు ఇచ్చి తమకు ఇవ్వకపోవడంపై వారిని నిలదీశారు. డబ్బులు అందరికీ ఇవ్వకుంటే సమస్యలేదని, కానీ కొంతమందికిచ్చి తమకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం వచ్చినా తాము వివిధ రకాల పన్నులు చెల్లించాల్సిందేనని చెప్పారు. ఎన్నికల్లో మాత్రమే ఓట్లు వేసేందుకు నగదు పంపిణీ చేస్తున్నారని, అదీ కూడా కొంతమంది దళారులు తమకు అందనివ్వకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఇలా అయితే తమ ఓటు ఎవరికి వేయాలో తామే నిర్ణయించుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై ఆయా పార్టీల నాయకులు స్పందించి అందరికీ అందేలా చూడాలని కోరారు.

శాంతిపురంలో వైసీపీ నేత ఇంటి వద్ద...

అక్కయ్యపాలెం: ఈ ఎన్నికల్లో డబ్బులు పం పిణీ జోరుగా సాగుతోంది. గ్రేటర్ 26వ వార్డు శాం తిపురంలోని శ్యామ్ అపార్ట్‌మెంట్ వద్ద వైసీపీ మహిళా నాయకురాలు, తాజా కార్పొరేటర్ అభ్యర్థి ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆది వారం రాత్రి నగదు పంపిణీ చేశారు. అక్కడ ఓటర్లు క్యూ కట్టడంతో తమకు ఇబ్బంది కలిగిందని పలువురు చెబుతున్నారు.



శ్యామ్ అపార్ట్‌మెంట్‌లో వైసీపీ మహిళా నేత ఇంటి ఎదుట మహిళలు

రూ.1.14 లక్షలు స్వాధీనం

సీతంపేట: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో ఓటర్లకు డబ్బులు పంచుతున్నట్టు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు దా డిచేసి రూ. 1.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో అభయంజనేయ స్వామి ఆలయం సమీపంలో కూ టమి అభ్యర్థికి సంబంధించిన నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు అ దుపులో తీసుకున్నారు. అ నంతరం వారిని తనిఖీ చేయగా, రూ.1.14 లక్షలు, ఓటర్ జాబితా లభించింది. దీంతో వారిని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఇదే క్రమంలో అధికార పార్టీకి చెందిన వ్యక్తుల వద్ద కూడా డబ్బు లభించినప్పటికీ వారిని అధికార బలంతో తప్పించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ. 2 లక్షలు స్వాధీనం

సీతంపేట శాంతినగరంలో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం రా త్రి అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి రూ.2 లక్షలు, ఓటరు లిస్టులు స్వాధీనం చేస్తున్నారు.

ఎన్ఏడీ ఫ్లైవోవర్‌పై ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- ఫ్లైవోవర్ పైనుంచి కిందకు పడిపోయిన యువకులు
- ఇద్దరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



పవన్‌కుమార్, తానవరపు కుమార్ (ఫైల్)

మర్రిపాలెం (విశాఖపట్నం), మే 12: మితిమీరిన వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని ఎన్ఏడీ ఫ్లై ఓవర్ పై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...విశాఖ నగరంలోని దొండపర్తి, కంచరపాలెం ప్రాంతాలకు చెందిన ఆరెల్లి పవన్‌కుమార్ (23), తానవరపు కుమార్ (24), గాంధీ (22) గాజువాక నుంచి ద్విచక్ర వాహనంపై ఆది వారం తెల్లవారుజామున నగరంలోకి వస్తున్నారు. వీరి బైక్ ఎన్ఏడీ ఫ్లైవోవర్ పైకి వచ్చేసరికి అదుపుతప్పి నేరుగా రోటరీ డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు ఫ్లైవోవర్ పైనుంచి కిందనున్న రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆరెల్లి పవన్‌కుమార్ (23) తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతిచెందగా, తానవరపు కుమార్, గాంధీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తక్షణం స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా కొద్దిసేపటికే తానవరపు కుమార్ మృతిచెందాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో గాంధీ చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్భయంగా ఓటు వేయండి: సీపీ



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖ పట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలింగ్‌కేంద్రాల వద్ద పరిస్థితిని నిరంతరం ప్రత్యక్ష ప ర్యవేక్షణ చేస్తామని సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ తెలిపారు. కమిషనరేట్‌లోని ఆధునికీకరించిన కమాండ్‌కంట్రోల్‌రూమ్‌లో ఎన్నికల సరళి పరిశీలనకు చేసిన ఏర్పాట్లను ఆదివారం ఆయన మీడియాకు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామన్నారు. పోలీస్ సిబ్బంది, అధికారులకు అందజేసిన బాడీవార్న్‌కెమెరాల నుంచి కూడా అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా వీక్షిస్తామన్నారు. అధికారులు వాడే వాహనాలు, సెల్‌ఫోన్లు, బాడీవార్న్‌కెమెరాలకు జీపీఎస్ అనుసంధానం చేయడంతో వారెక్కడ తిరుగుతున్నారు, ఏం చేస్తున్నారు, కేటాయించిన ప్రదేశంలో విధులు నిర్వర్తిస్తున్నారా? లేదా? వంటి వివరాలన్నీ ఎప్పటికప్పుడు తెలిసిపోతాయన్నారు. దీంతో ఎక్కడైనా అవాంఛనీయ సంఘనలు చర్యలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా డయల్ 100 లేదా, 112కి కాల్‌చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటుకు వేళాయె

... 5వ పేజీ తరువాయి

ఏఆర్వోలు, 21 మంది నోడల్ అధికారులను నియమించగా, జిల్లాను 152 సెక్టార్లుగా విభజించి 207 రూట్లు ఏర్పాటుచేశారు. జిల్లాలో 502 క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాలు గుర్తించిన అధికారులు, అక్కడ పూర్తిగా, మొత్తం 75 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేశారు.

మహిళలే కీలకపాత్ర

జిల్లాలో మొత్తం 20,12,373 మంది ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 10,19,487 మంది (50.66 శాతం ఉన్నారు). ఏడు అసెంబ్లీ స్థానాల్లో గాజువాక తప్ప మిగిలిన అసెంబ్లీ స్థానాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అత్యధికంగా విశాఖ తూర్పులో 51.21 శాతం మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు 97 వేల మంది ఉండగా...వారిలో సుమారు 49 వేల మంది ఓటు నమోదుచేసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయంతో తొలిసారిగా ప్రభుత్వ ఉద్యోగులు 18 వేల మంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు.

భారీ బందోబస్తు

గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు జిల్లాలో 502 క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాల్లో సివిల్ పోలీసులతోపాటు కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 5,023 మంది పోలీసులను నియమించారు. సివిల్ పోలీసులు 3,023, స్పెషల్ పోలీసులు 100 మంది, ఒక ప్లాటూన్, కేంద్ర పారామిలటరీ బలగాలు పది కంపెనీలు 1000 మందితోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రిటైర్డు పోలీసులు, మాజీ సైనికులు మరో 900 మంది వరకూ ఉన్నారు. ప్రతి కేంద్రంలో విధుల్లో ఉన్న పోలీసుల సెల్‌ఫోన్లు, బాడీకెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. ఇప్పటికే రౌడీషీటర్లు, వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి బైండోవరు చేశారు.

11 మోడల్ పోలింగ్ స్టేషన్లు

జిల్లాలో ఈ పర్యాయం 11 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మహిళా ఉద్యోగులు విధులు నిర్వహించేలా ఏడు, యువత, విభిన్న ప్రతిభావంతులు విధులు నిర్వహించేలా చెరో రెండు కేంద్రాలు ఏర్పాటుచేశారు. కాగా జిల్లాలో సుమారు ఎనిమిది వేల మంది దివ్యాంగ ఓటర్లు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రంలో బ్రెయిలీ లిపిలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో కూడిన బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. వీటి ఆధారంగా ఈవీఎం మిషన్ దగ్గరకు సహాయకుని సాయంతో వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటారు.

విశాఖ ఓటర్లు ఎవరి వైపు?

... 5వ పేజీ తరువాయి

భూముల పరిరక్షణ, ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధి, మోడల్‌గా విశాఖ పార్లమెంటు అభివృద్ధి వంటి హామీలు ఇచ్చారు. ఈ ప్రాంత సమస్యలను బలంగా వినిపిస్తానని నమ్మకం కలిగించారు. నగరంలోని అన్ని వర్గాలు ఆయన మాటలను విశ్వసిస్తున్నాయి. ఈసారి బీజేపీ, జనసేన కూడా తోడు కావడంతో బలం మరింత పెరిగింది. ఇక వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి పార్టీ బలంపైనే ఆధారపడ్డారు. ఆమె విజయనగరం జిల్లా నుంచి గతంలో ఎంపీగా గెలిచినా విశాఖ ప్రజలకు పెద్దగా తెలియదు. తన గళాన్ని కూడా అందరికీ వినిపించలేకపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక విశాఖలో పెరిగిన భూ దందాలు, ప్రాజెక్టుల హస్తగతం, పర్యాటక ప్రాజెక్టుల విధ్వంసం, నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపు, ఆస్తి పన్ను పెంపు, చెత్త పన్ను విధింపు...ఇవన్నీ వైసీపీపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయి. పారిశ్రామిక, వ్యాపార, ఉద్యోగ వర్గాలు ఏవీ వైసీపీని కోరుకోవడం లేదు. శ్రీభరత్ భారీ మెజారిటీతో గెలుస్తారనే విశ్వాసం కూటమిలో వ్యక్తమవుతోంది.

తూర్పున ఉదయించే సూరీడు ఎవరో?

తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు నాలుగోసారి గెలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. అక్కడ ఆయన్ను పడగొట్టడమే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐదేళ్లుగా పని చేస్తున్నాయి. వైసీపీ సమన్వయకర్తలుగా పనిచేసిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, అక్కరమాని విజయనిర్మల కూటమిలోకి వచ్చేశారు. ఈ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైనప్పటి నుంచి విస్తృతంగా పర్యటిస్తున్నారు. డబ్బులు కూడా విపరీతంగా ఖర్చు చేశారు. ఒక్క ఫోన్ కాల్ దూరంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన ప్రచారం చేస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

పశ్చిమలో నువ్వా..నేనా?

పశ్చిమ నియోజకవర్గంలో పోటీ నువ్వా?, నేనా? అన్నట్టుగా జరుగుతోంది. టీడీపీ అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు, వైసీపీ తరఫున ఆడారి ఆనంద్‌కుమార్ పోటీ పడుతున్నారు. గణబాబు ఈసారి కూడా గెలిస్తే హ్యాట్రిక్ సాధించినట్టు అవుతుంది. ఆయనకు నియోజకవర్గంలో అన్ని సమస్యలపైన అవగాహన, వాటిని సాధించుకునే నేర్పు ఉంది. వైసీపీ అభ్యర్థి ఆనంద్‌కుమార్ గతంలో తెలుగుదేశం పార్టీలో ఉండేవారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తరువాత వైసీపీలో చేరిన ఆయన్ను అధిష్ఠానం పశ్చిమ ఇన్‌చార్జిగా నియమించింది. అప్పటినుంచి ఆయన నియోజక వర్గంలో పర్యటిస్తూనే ఉన్నారు.

ఉత్తరంలో రాజుల మధ్యే యుద్ధం

ఉత్తర నియోజకవర్గంలో కూటమి తరఫున విష్ణుకుమార్‌రాజు పోటీ చేస్తున్నారు. ఆయన 2014 ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. గత ఎన్నికల్లో ఏ పార్టీ సహకారం లేకపోవడంతో బీజేపీ ఓట్లనే సాధించగలిగారు. ఈసారి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అటు టీడీపీ, ఇటు జనసేన సహకరిస్తున్నాయి. అయితే వైసీపీ తరఫున పోటీలో ఉన్న కేకే రాజు గట్టి పోటీ ఇస్తున్నారు. కేకే రాజు గత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో గంటా చేతిలో ఓడిపోయారు. అయినా ఈ ఐదేళ్లు ఆయనే ఎమ్మెల్యేగా చలామణి అయ్యారు. ఇక్కడ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ జరుగుతోంది. ఇక్కడ జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

దక్షిణంలో మారిన గాలి

దక్షిణ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన నుంచి వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ పోటీ చేస్తున్నారు. ఆయన ఇటీవలె జనసేనలో చేరారు. బలమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. అక్కడ టీడీపీ నుంచి పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ బాగా సహకరిస్తున్నారు. వంశీ మొదట్లో కొంత వెనకబడి ఉన్నా ఆ తరువాత స్పీడ్ అందుకొని దూసుకుపోయారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీలో ఉన్నారు. కార్పొరేటర్లతో విభేదాలు, వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత...తదితరాలు ఆయనకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందంటున్నారు.

గాజువాకలో పల్లా హవా

గాజువాక నియోజకవర్గంలో టీడీపీ తరఫున పల్లా శ్రీనివాసరావు పోటీ పడుతుండగా, వైసీపీ నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బరిలో దిగారు. పల్లా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి అండగా ఉన్నారు. కార్మికులు ఆయన్ను విశ్వసిస్తున్నారు. గతంలో కూడా ఆయన గాజువాక నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ఉన్నారు. ఇక వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మంత్రిగా ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదనే విమర్శ ఉంది. పవన్ కల్యాణ్‌పై ఇష్టారాజ్యంగా విమర్శలు చేయడంతో సొంత సామాజిక వర్గం నుంచి కూడా సహకారం లేదంటున్నారు.

భీమిలి మిత్రుల మధ్య వార్

భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మాజీ మంత్రులు పోటీ పడుతున్నారు. ఒకరు సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు కాగా మరొకరు గంటా శ్రీనివాసరావు. ఇద్దరూ ఒకప్పుడు మిత్రులు. ఒకే పార్టీలో చాలాకాలం కలసి పనిచేశారు. ఐదేళ్ల నుంచి వేర్వేరు పార్టీల్లో కొనసాగుతున్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు, మంచితనం గెలిపిస్తాయని అవంతి చెబుతుంటే...తన విజయం ఖాయమైపోయిందని గంటా శ్రీనివాసరావు అంటున్నారు. భీమిలి ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

పెందుర్తిలో..

పెందుర్తి వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ప్రత్యర్థిగా జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పోటీలో ఉన్నారు. అదీప్‌రాజ్ ఈ ఐదేళ్లలో భూ దందాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు కూటమి మేనిఫెస్టోకు ప్రజలు ఆకర్షితులు కావడంతో పంచకర్ల రమేశ్‌బాబుకు కలిసొస్తుందని అనుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం ఓటర్ల ఫీట్లు

- ఎన్నికల విధులకు 543 బస్సుల తరలింపు
- కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పడిగాపులు
- స్వస్థలాలకు వెళ్లేవారికి తప్పని అగచాట్లు



బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటుహక్కు వినియోగించుకునేందుకు స్వస్థలాలకు వెళ్లేవారికి ఆర్టీసీ అధికారులు చుక్కలు చూపించారు. బస్సులన్నింటినీ ఎన్నికల విధులకు కేటాయించడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సినవారంతా బస్సుల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గుంటూరు, విజయవాడ వంటి దూరప్రాంతాల్లో ఉంటున్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందినవారంతా సోమవారం జరిగే పోలింగ్‌లో తమ ఓటుహక్కుని స్వస్థలంలో వినియోగించుకునేందుకు రైళ్లలో సోమవారం ఉదయానికి నగరానికి చే రుకున్నారు. నగరం నుంచి బస్సుల్లో స్వస్థలాలకు వెళ్లేందుకు ద్వారకాబస్‌స్టేషన్‌కు వచ్చారు. వీరితో పాటు నగరంలో ఉంటూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఓటు హక్కు ఉన్నవారు స్వస్థలాలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం బయలుదేరారు. బస్సులు లేక గంటల తరబడి వేచివుండాల్సి వచ్చింది. ఏ దైనా బస్సు వస్తే ఎక్కేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థి తి నెలకొంది. జిల్లాలోని మధురవాడ, మద్దిలపాలెం, విశాఖపట్నం, వాల్తేరు, గాజువాక, స్టీల్‌సిటీ, కూర్మన్నపాలెంలో డిపోల్లో 804 బస్సులున్నాయి. వీటిలో 543 బస్సులను ఎన్నికల విధులకు కేటాయించారు. మిగిలిన 261 బస్సుల్లో 20 బస్సులను ఎన్నికల విధులకు స్పేర్‌గా ఉంచారు. మరో 11 బస్సులను నగర పరిధిలో అత్యవసర పరిస్థితులు తలెత్తితే వినియోగించేందుకు కేటాయించారు. ఇవన్నీ పోగా మిగిలిన 230 బస్సులు మాత్రమే శ్రీకాకుళం, విజయనగరం, సాలూరు, పార్వతీపురం, ఇచ్ఛాపురం, రాజాం, అనకాపల్లి, నర్సీపట్నంతోపాటు రాజమండ్రి, కాకినాడ, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు వంటి దూరప్రాంతాలకు నడిపారు. దీనివల్ల సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు బస్సుల కోసం పిల్లలు, లగేజీతో కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిం చాల్సి వచ్చింది.

రెట్టింపు చార్జీలు వసూలు చేసిన ప్రైవేటు ఆపరేటర్లు

కొంతమంది వేచివుండలేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఒకేసారి డిమాండ్ పెరగడంతో ప్రైవేటు ఆపరేటర్లు రెట్టింపు చార్జీలను వసూలు చేశారు. అంతమొత్తం వెచ్చించి వెళ్లలేనివారు కాంప్లెక్స్‌లోనే ఎదురుచూశారు. బ స్సు వచ్చిందంటే చాలు ఫ్లాట్‌ఫాం మీదకి రాకముందే పరుగెత్తుకుంటూ వెళ్లి సీట్ల కోసం పోటీపడ్డారు. కొందరైతే పిల్లలను బస్సు కిటికీల నుంచి లోపలకు పంపించి సీట్ రిజర్వు చేసుకోవడం కనిపించింది. శ్రీకాకుళం, విజయనగరం, నర్సీపట్నం వెళ్లేందుకు ప్రయాణికులు బారులు తీరడంతో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద రద్దీ కొనసాగింది. ఆర్టీసీ అధికారులతో కలసి ఓటు హక్కువినియోగించుకోకుండా తమనుఅడ్డుకునేందుకే వైసీపీ నేతలు కుట్ర చేశారని కొందరు ఆరోపించడం విశేషం.

ప్రేమ సమాజానికి వితరణ

డాబాగార్డెన్స్, మే 12: ఐటీసీ గ్లోబల్, ఆర్ఆర్‌టీం వార్షికోత్సవాన్ని డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలోని అనాథ బాలబాలికల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ప్రేమ సమాజం అధ్యక్షులు బుద్ధ శివాజీ, నిర్మాత పీఎస్ తిలక్, కోశాధికారి గుప్తా, ఐటీసీ గ్లోబల్ ఫౌండర్ డా.రతన్‌రాజ్, డి.లాజరస్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ప్రేమ సమాజానికి ఫ్యాన్స్, ఎల్ఈడీ బల్బులు వితరణగా అందజేశారు.



శంకరాచార్యుల విగ్రహానికి హారతిస్తున్న పీఠాధిపతి

శారదా పీఠంలో శంకరాచార్యుల జయంత్యుత్సవాలకు శ్రీకారం

పెందుర్తి, మే 12: చినముషిడివాడలోని శారదా పీఠంలో ఆదివారం అద్వైత బోధకుడు జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణంలోని శంకరాచార్యుల విగ్రహానికి పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రణమిల్లారు. విశేష పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఇక్కడి స్వర్ణ మండపంలో వేదపండితులు, పీఠాధిపతి శిష్యులు ఉపనిషిత్తుల పారాయణాన్ని పఠించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ భారతవనికి అద్వైత వేదాన్ని బోధించి జ్ఞానభిక్ష పెట్టింది శంకరాచార్యులేనని అన్నారు. శంకరతత్వం విశ్వ విస్తృతం కావాలన్నారు. శంకరుని సంప్రదాయాన్ని అనుసరిస్తున్న పీఠాల్లో శారదాపీఠం ప్రముఖమైనదని ఆయన పేర్కొన్నారు. తొలుత వేదాభ్యాసన శిష్యులు పీఠాధిపతికి గురువందనం సమర్పించారు. కార్యక్రమలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు.

మాతృమూర్తులకు సత్కారం



మాతృమూర్తులను సత్కరించిన కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మే 12: హైస్కూల్ రోడ్డులోని అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి పలువురు మాతృమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ తొలి గురువు తల్లి అని, ఆమే తమ పిల్లల నడవడికను మంచి మార్గంలో తీర్చుదిద్దుతుందన్నారు. తల్లిదండ్రులను గౌరవించినవారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ, నాగవల్లి, ఉషారాణి, మాధవి, షబీనా, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి సత్రం జంక్షన్‌లో గల మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు నిరుపేదలైన పలువురు మాతృమూర్తులకు చీరలను పంపిణీ చేశారు. మనకు జన్మనిచ్చిన తల్లి రుణం ఏమిచ్చినా తీర్చుకోలేదన్నారు. ప్రతిఒక్కరూ తమ తల్లిని ప్రేమగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

14 నుంచి సనాతన ధర్మ బోధకుల సమావేశం

విశాఖపట్నం, మే 12: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ప్రపంచ సనాతన ధర్మ బోధకుల సమావేశం జరగనున్నట్టు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ యువజన మండలి (బివైసీ) ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సమావేశాలకు సనాతన ధర్మాన్ని బోధిస్తున్న సుమారు 200 మంది ఆధ్యాత్మిక యువ నాయకులు, వరిష్ఠసన్యాసులు హాజరుకానున్నట్టు చెప్పారు. వారి ఆధ్యాత్మిక జీవితాలు, సనాతన ధర్మ ప్రచార విశేషాలు గురించి మూడు రోజులు పాటు ప్రవచనాలు చేయనున్నారు. ఈమేరకు పూజా కార్యక్రమాలు ఉదయం నాలుగున్నరకు ప్రారంభమై సాయంత్రం తొమ్మిది గంటలకు ముగియనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 22, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 34, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 22, క్యారెట్ 36, దొండకాయలు 27, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 30, బరబాటి 46, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 98, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 40, కీరదోస 30, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	133
ఫారం ధర	--	153
విత్ స్కిన్	--	276
స్కిన్‌లెస్	--	286



గాజువాక పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు



పినమడకలో యువ ఓటర్ల కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన పోలింగ్ బూత్



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

నేడే పోలింగ్

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ▸▸ 'పెందుర్తి'లో 3,07,545 మంది ఓటర్లు.. 299 పోలింగ్ కేంద్రాలు

ఎవరైనా విధులకు డుమ్మా కొడితే సస్పెండ్ చేస్తామని హెచ్చరించిన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

'గాజువాక'లో 3,33,611మంది ఓటర్లు .. 306 పోలింగ్ కేంద్రాలు ▸▸ గంగవరంలో అదనపు బందోబస్తు

పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,13,429 మంది.. 222 పోలింగ్ కేంద్రాలు

పెందుర్తి, మే 12: సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి సర్వం సిద్ధం చేశారు. 'పెందుర్తి' ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ, పెదగంట్యాడ మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 3,07,545 మంది ఓటర్లకు గాను వీరిలో పురుషులు 1,52,592, మహిళలు 1,54,948 మంది, ట్రాన్స్‌జెండర్స్ ఐదుగురు ఉన్నారు. వీరికోసం 299 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. కాగా మొత్తం ఓటర్లలో అత్యధికంగా పెందుర్తి మండలంలోనే 1,71,915 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 85,670 మంది, మహిళలు 86,243, టాన్స్‌జెండర్స్ ఇద్దరు ఉన్నారు. అలాగే సబ్బవరం మండలంలో 59,548 మంది ఓటర్లలో పురుషులు 29,147 మంది, మహిళలు 30,400 మంది, టాన్స్‌జెండర్ ఒకరు, పరవాడ మండలంలో మొత్తం 64,459 ఓటర్లలో పురుషులు 31,893 మంది, మహిళలు 32,564 మంది, టాన్స్‌జెండర్స్ ఇద్దరు ఉన్నారు, పెదగంట్యాడ మండలంలో 11,623 ఓటర్లలో పురుషులు 5,882 మంది, మహిళలు 5,741 మంది ఉన్నారు.

716 ఈవీఎంలు సిద్ధం

పెందుర్తి శాసనసభకు రిజర్వ్ ఈవీఎంతో కలిపి 358, లోక్‌సభకు 358 కలిపి మొత్తం 716 ఈవీఎంలను సిద్ధం చేశారు. పోలింగ్ బూత్‌లో ఓటర్లు ముందుగా పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థికి ఓటు వేయాలి. ఆ తర్వాత పక్కనే గల మరో కంపార్ట్‌మెంట్ వద్ద ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేయాలి. పోలింగ్ బూత్‌లోకి సెల్ ఫోన్లు, ఐపాడ్ వంటి వాటిని అనుమతించరు. పోలింగ్ కేంద్రాలను 28 రూట్లుగా విభజించారు. నియోజకవర్గంలో మొత్తం 3,500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు బూత్‌ల వద్ద క్యూ పద్ధతి పాటించేందుకు లైన్‌మెన్లుగా 300 మందిని నియమించారు. సమస్యాత్మక, సున్నిత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ నిర్వహణ కోసం 169 మంది ఎన్నికల సూక్ష్మ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమాచారం తెలుసుకునేందుకు వీలుగా వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 135 మంది సాంకేతిక సిబ్బంది సేవలు అందించనున్నారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు ఏపీవోలను నియమించారు. అదేవిధంగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు వివిధ శాఖల పోలీస్ బలగాలతో కలిపి 520 మంది సిబ్బంది విధుల్లో ఉంటున్నట్టు సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కాగా ఆదివారం పోలింగ్ సిబ్బందికి ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చి, ఈవీఎంల పనితీరును వివరించి పోలింగ్ సామగ్రిని అందజేశారు. కలెక్టర్ మల్లికార్జున ఈఆర్వో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ నాడు సిబ్బంది ఎవరైనా గైర్హాజరైతే వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా ఓటరు స్లిప్పులు అందలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఓటర్ల జాబితాలో పేరున్న ప్రతిఒక్కరికీ ఎన్నికల అధికారులు స్లిప్‌లు పంపిణీ చేయాలి. అయితే చాలా మంది తమకు ఓటరు స్లిప్పులు అందలలేదని వాపోతున్నారు. కాగా పలు రాజకీయ పార్టీల నాయకులు మాత్రం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేశారు. వీటితో పాటు ఫొటోతో కూడిన గుర్తింపు కార్డును తీసుకువెళ్లి ఓట్లు వేయాలని వారు కోరుతున్నారు.

'గాజువాక'లో 3,36,611 మంది ఓటర్లు

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్: గాజువాక నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 'గాజువాక'లో ఉన్న 306 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను ఆదివారం మధ్యాహ్నం తరలించారు. ప్రతి కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలో గాజువాక మండలంతో పాటు పెదగంట్యాడ మండలంలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 3,33,611 మంది ఓటర్లుండగా.. వీరిలో పురుషులు 1,67,112 మంది, మహిళలు 1,66487, ఇతరులు 12 మంది ఉన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహిం చేందుకు గాను సుమారు నాలుగు వేల మంది పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పరిశీలకులతో పాటు మైక్రో అబ్జర్వర్‌లు, వంద కేంద్రాలకు అదనపు పీవోలు, సెక్టార్ అధికారులను నియమించారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రమే ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు.



పెందుర్తిలో సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రం



చినగంట్యాడలోని కేంద్రం వద్ద టెంట్లు వేసిన దృశ్యం



శ్రీహరిపురంలోని కేంద్రానికి బస్సుల్లో చేరుకున్న సిబ్బంది



నెల్లిముక్కు ఎంపీపీ స్కూల్లో ఏర్పాటు చేసిన కేంద్రం

27 సమస్యాత్మక కేంద్రాలు

కాగా నియోజకవర్గంలో 27 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. ఇందులో భాగంగా గంగవరం ప్రాంతంలో అదనపు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎందుకంటే ప్రస్తుతం ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నవారు అధికంగా అదానీ గంగవరం పోర్టులో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పోర్టు కార్మికులు సమ్మె చేస్తున్నందున ఏమైనా ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించవలసిందిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

మండలంలో 86 పోలింగ్ కేంద్రాలు

పెదగంట్యాడ: ఎన్నికలకు సంబంధించి మండలంలో 86 పోలింగ్ కేంద్రాలను 1,05,000 మంది ఓటర్ల కోసం అధికారులు సిద్ధం చేశారు. ఆదివారం మధ్యాహ్నానికే పోలింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ మెటీరియల్, ఈవీఎంలతో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. సుమారు 315 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అన్ని కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఓటర్లకు ఎండ తగలకుండా ఉండేందుకు టెంట్లు వేయడంతో పాటు ప్రథమ చికిత్సా శిబిరాలను ఏర్పాటు చేశారు.

ఉక్కు టౌన్‌షిప్‌లో 9 పోలింగ్ బూత్‌లు..

ఉక్కుటౌన్‌షిప్: గాజువాక నియోజకవర్గానికి సంబంధించి ఉక్కు టౌన్‌షిప్‌లో మూడు కేంద్రాల్లో తొమ్మిది పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. డీఏవీ స్కూల్‌లోని రెండు బూత్‌లలో 1,843 మంది, కేవీ స్కూల్‌లో రెండు బూత్‌లలో 1,609, వీవీవీ స్కూల్‌లోని నాలుగు బూత్‌లలో 3,543 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇక్కడి కేంద్రాలన్నీ ప్రశాంతమైనప్పటికీ నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేసినట్టు స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

అమలులో 144 సెక్షన్

కూర్మన్నపాలెం: ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా దువ్వాడ పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాలకు రెండు వందల మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓట్లు వేసేందుకు వెళ్లే వారంతా పోలింగ్ కేంద్రాలకు సెల్ ఫోన్లను తీసుకువెళ్లరాదని సూచించారు. అందరూ ఏదో ఒక గుర్తింపు కార్డును ఓటరు స్లిప్పులతో పాటు తీసుకువెళ్లావలసిందిగా వారు సూచించారు. కాగా ఇక్కడి పోలింగ్ కేంద్రాలలోని వసతులను అధికారులు పరిశీలించారు.

79, 85 వార్డుల్లో..

అగనంపూడి: 'గాజువాక' ఎన్నికలకు సంబంధించి 79, 85వ వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరసర ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 85వ వార్డులోని 18 పోలింగ్ బూత్‌ల్లో 19,333 మంది, 79వ వార్డులోని ఏడు బూత్‌ల్లో 9,500 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఫార్మాసిటీ పునరావాస కాలనీ, డొంకాడ, పినమడక, బీసీ కాలనీ, పెదమడక, దానబోయినపాలెం, కొండయ్యవలస, పాత అగనంపూడి, కేఎస్ఎన్ రెడ్డినగర్‌ల్లోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు సర్కారు జూనియర్ కళాశాల్లో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఆదివారం మధ్యాహ్నానికే ఎన్నికల సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. అలాగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. ఆయా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

'పశ్చిమ'లో పటిష్ఠ ఏర్పాట్లు చేశాం: ఎన్నికల అధికారి హుస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం: పశ్చిమ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్టు రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 2,13,439 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. వీరిలో 1,05202 మంది పురుషులు, 1,08226 మంది మహిళలు, ఇతరులు 11 మంది ఉండగా, 222 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. కాగా నియోజకవర్గంలో 69 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. వీటితో పాటు మిగతా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేసేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. వీడియో నిఘా ఏర్పాట్లు చేశామని, ఎన్నికల విధుల్లో 1,937 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. ఓటర్లకు, ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు హుస్సేన్ సాహెబ్ పేర్కొన్నారు.

89, 91, 92 వార్డుల్లో..

గోపాలపట్నం: గోపాలపట్నం కేంద్రంగా 89, 91, 92 వార్డుల్లోని లక్ష్మీనగర్, గోపాలపట్నం, కొత్తపాలెం, యల్లపువానిపాలెం, వెంకటాపురం, పద్మనాభనగర్ ప్రాంతాల్లో గల ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో 63 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల నిర్వహణ కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు సాయుధ బలగాలతో బందోబస్తును సిద్ధంగా ఉంచారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు మౌలిక వసతులన్నీ ఉండేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి పోలింగ్ కేంద్రాలకు నియమిత దూరంలో రాజకీయ పార్టీల నాయకులు షామియానాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల్లో..

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఏడు వార్డుల్లో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాయంత్రానికల్లా అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఈవీఎం మిషన్‌లతో చేరుకున్నారు. మల్కాపురం స్టేషన్ పరిధిలో సుమారు రెండు వందల మంది పోలీసులు ఎన్నికల్లో విధుల్లో ఉన్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి గాజువాక పీఎస్ పరిధిలో పిలకవానిపాలెం, ములగాడ, ఎదురువానిపాలెం, ములగాడ హౌసింగ్ కాలనీ, హిమచల్‌నగర్, తదితర ప్రాంతాలు ఉన్నందున అక్కడ గాజువాక పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించారు. ఇక్కడి 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల్లో 92,222 మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను 92 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

బుచ్చిరాజుపాలెంలో స్మార్ట్ పోలింగ్ స్టేషన్..



స్మార్ట్ పోలింగ్ కేంద్రం వద్ద బెలూన్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట: 'పశ్చిమ' పరిధిలోని 90, 52వ వార్డుల్లోని అన్ని పోలింగ్ బూత్‌లకు ఆదివారం మధ్యాహ్నానికే ఎన్నికల సిబ్బంది, పోలీసులు సామగ్రితో చేరుకున్నారు. బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్ బ్లాక్-1లో ఉన్న 59వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని స్మార్ట్ పీఎస్‌గా ఎంపిక చేశారు. దీంతో ఈ బూత్ స్వాగత ద్వారం వద్ద బెలూన్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇక్కడకు ఓట్లు వేసేందుకు వచ్చేవారికి పువ్వులు అందించి స్వాగతం పలుకుతారు. అదేవిధంగా పెందుర్తి నియోజకవర్గ పరిధి 93, 94, 98వ వార్డుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడి ఆర్ఆర్‌వీపురం ఆళ్వార్స్ కళాశాల ప్రాంగణం, వేపగుంట హైస్కూల్, ప్రహ్లాదపురం ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాల పోలింగ్ బూత్‌లకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు.



స్టీల్‌ప్లాంటులో పహారా కాస్తున్న పోలీసులు



రాజీవ్ నగర్ పోలింగ్ స్టేషన్ వద్ద టెంట్లు వేసిన దృశ్యం



ఫార్మాసిటీలోని పోలింగ్ కేంద్రం

ఓటు ద్వారా తల్లిలాంటి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, తదితరులు

కూర్మన్నపాలెం, మే 12: ఓటు ద్వారా తల్లిలాంటి స్టీల్‌ప్లాంటును కాపాడుకుందామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,186వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఉక్కు కర్మాగార పరిరక్షణకు పాటుపడే నాయకులకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఓటే మన ఆయుధమని, ఎండవానలకు బెదరకుండా ఎంతసేపైనా క్యూలో వేచివుండి ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి నాయకుని పర్యవేక్షణలో పోరాటాలు చేసి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందామన్నారు. కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబానీ, అదానీలకు ప్రభుత్వరంగ సంస్థలను అప్పగించేందుకు చూస్తుందని విమర్శించారు. అందరూ విజన్ ఉన్న పార్టీకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా విశ్వేశ్వరాలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, మే 12: జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్‌లో ఆదివారం శ్రీకాశీఅన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాలయ ఆరో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అకల్మష హోమం, దిగ్ దేవతా ప్రార్థన, హారతి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. అలాగే సాయంత్రం మత్సంగ్రహణ, అంకురార్పణ, స్వామివారి విశేష గ్రామోత్సవం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు పూజ, వాస్తు హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీఈసీ సభ్యుడు దామా సుబ్బారావు, దమయంతి, స్థానిక నాయకులు సుధీర్, బాబు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై భారీ వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

సింహాచలం, మే 12 : సింహగిరిపై ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. 9 గంటల సమయంలో ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్ముకుని సుమారు గంట పాటు వర్షం పడింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కాగా ఇన్నాళ్లు వేసవి తాపంతో అల్లాడిన సింహగిరివాసులు వర్షంతో ఉపశమనం పొందారు.

ముగిసిన తిరునక్షత్ర పూజలు

విశిష్టాద్వైత మత స్థాపకులు, తత్వవేత్త రామానుజాచార్యుల 1,007వ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని అప్పన్న స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని ఒక వేదికపై, స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో మరో వేదికపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.ఈ నెల ఎనిమిది నుంచి ప్రారంభమైన తిరునక్షత్ర పూజలు ఆదివారం రాత్రితో పూర్తయ్యాయి. బేడామండపం వద్ద తిరువీధి జరిపారు. స్థానాచార్యులు రాజగోపాల్ రామానుజాచార్యులు, భగద్విషయం పండితులు సూర్యనారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయండి: కలెక్టర్

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సోమవారం జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. గత (2019) ఎన్నికల్లో జిల్లాలో 66 శాతం పోలింగ్ జరిగిందని, అయితే ఈ పర్యాయం ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని 80 శాతానికి పెంచాలని కోరారు.

ఓటు వేయడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లే ఓటర్లు తప్పనిసరిగా ఏదైనా ఒక గుర్తింపు కార్డును తీసుకునివెళ్లాలి. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసిన పాస్ బుక్, పాన్ కార్డు, జనగణన ఆధారంగా జారీచేసిన స్మార్ట్ కార్డ్, ఫొటో ఉన్న పెన్షన్ కార్డు...వీటిలో ఏదో ఒకటి తీసుకుని వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

ఓటరు స్లిప్ పొందండి ఇలా..

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రజలందరికీ ఇప్పటికే ఓటరు స్లిప్‌లను బీఎల్వోలు ఇంటింటికీ అందించారు. ఇప్పటికీ ఓటరు స్లిప్ అందని వారంతా తమ మొబైల్ ఫోన్‌లో ఓటరు స్లిప్పులు పొందేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ఓటర్లు చేయాల్సిందలా 1950 నెంబర్‌కు మెసేజ్ చేయడమే. ఇలా మెసేజ్ చేసిన 15 సెకన్లలోనే ప్రతి ఒక్కరూ ఓటరు స్లిప్ పొందుతారు. మెసేజ్ చేసే సందర్భంలో ముందుగా 'ఈసీఐ అని టైప్ చేసి, స్పేస్ ఇచ్చి మీ ఓటరు ఐడీ నంబరును టైప్ చేయాలి. ఆ తరువాత 1950కు సెండ్ చేస్తే మీ ఓటరు స్లిప్ మీసెల్‌కు చేరుతుంది. ఇందులో మీ పేరు, సీరియల్ నంబరు, మీ ఓటు ఎక్కడ ఉంది, బూత్ నంబరు, ఏరియా, పోలింగ్‌స్టేషన్ తదితర వివరాలన్నీ క్షణాల్లో మీ ముందుంటాయి. మరింకెందుకు ఆలస్యం మీకు ఓటరు స్లిప్ అందకపోతే వెంటనే మొబైల్ ద్వారా తెలుసుకోండి.

వైసీపీ ఆఖరి అస్త్రం

- మహిళా సంఘాల సభ్యులకు డబ్బులు ఎర
- బ్యాంకు బుక్ తీసుకువస్తే ఖాతాల్లో జమ చేస్తామని హామీ
- వాట్సాప్‌లో ఆర్పీ వాయిస్ మెసేజ్
- కేకే రాజుకు ఓటు వేయాలని వినతి

విశాఖపట్నం, మే 12: ఇప్పటివరకు తాయిలాలు, డబ్బులతో ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేసిన వైసీపీ నాయకులు పోలింగ్ రోజున కూడా మహిళలకు డబ్బు పంపిణీ చేస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ రిసోర్స్ పర్సన్ వాయిస్ మెసేజ్ హల్‌చల్ చేస్తోంది. అందులో మహిళా సంఘాల సభ్యులు సోమవారం ఉదయం 8 గంటలకు సంఘం బ్యాంకు పాస్ పుస్తకాలను తనకు ఇవ్వాలని కోరింది. డబ్బు పంపిణీకి అవకాశం లేకపోవడంతో నేరుగా బ్యాంకు ఖాతాలోనే జమచేస్తారని నేతలు చెప్పారని, పాస్‌బుక్‌లు అందిస్తే డబ్బులు జమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చింది. ఆ తరువాతే ఓటు వేసేందుకు వెళ్లాలని కూడా సూచించింది. అలాగే, ఉత్తరంలో వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేకే రాజుకు ఓటు వేయాలని కోరింది.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నిలకు యంత్రాంగం ఏర్పాటు పూర్తి చేసింది. రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వెయ్యి ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. మూడు, నాలుగు పోలింగ్ బూత్‌లు ఒక చోట ఉన్న దగ్గర వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్ వద్ద ఆశా కార్యకర్త ఉదయం ఏడు నుంచి సాయంత్రం వరకు సేవలందిస్తారు. ఆమెతోపాటు టీబీ సిబ్బంది, ఫార్మాసిస్టులు ఉంటారు. కేంద్రాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్‌తోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఏదైనా ఇబ్బంది ఎదురైతే ప్రాథమిక చికిత్స అనంతరం దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశామని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

నేడు విశాఖ-బ్రహ్మపూర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మే 12: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, బ్రహ్మపూర్ మధ్య సోమవారం ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలును ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు సోమవారం (13న) ఉదయం 8.30 గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరిగి సోమవారం (13న) సాయంత్రం 6.30కు బ్రహ్మపూర్‌లో బయలుదేరి రాత్రి 11.15 కు విశాఖ చేరుతుంది.

విశాఖ, కోరాపుట్‌కు అదనపు కోచ్‌లు

విశాఖ, కోరాపుట్ మధ్య నడుస్తున్న రైలు సర్వీసులకు రెండు అదనపు జనరల్ కోచ్‌లు జత చేస్తున్నామని పేర్కొన్నారు.


సౌత్ పరిధి కలెక్టరేట్ సమీపంలో పోలింగ్ కేంద్రంలో సిబ్బంది


ఆర్పీపేట స్కూల్ పోలింగ్ కేంద్రం ఎదుట అధికారులు, పోలీసులు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 56వ వార్డులో ఆర్పీ పేట, కంచరపాలెం పాఠశాలలో కేంద్రాలు
- 48వ వార్డులో రాంజీ ఎస్టేట్, స్టీల్‌సిటీ, పాలిటెక్నిక్ కళాశాలలు..

కంచరపాలెం, మే 12: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో జీవీఎంసీ 47,48,54, 56,57 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. 47వ వార్డు పరిధి ఓటర్లు స్థానిక రాంజీ ఎస్టేట్ పాఠశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద తమ ఓటు హక్కును వినియోగించనున్నారు. 48వ వార్డునకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను ఊర్వశి జంక్షన్ స్టీల్ సిటీ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బర్మాక్యాంప్‌లోని కె.కాలనీ స్కూల్లో ఏర్పాటు చేశారు. 54వ వార్డుకు సంబంధించి కప్పరాడ హైస్కూల్, జ్యోతి నగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. 56వ వార్డు గవరకంచరపాలెం, ఆర్పీపేట, చాకలిగెడ్డ, దయానంద నగర్ గ్రామాల ప్రజలకు మెట్టు వద్దపై ఆర్పీపేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. 57వ వార్డులో సుభాష్ నగర్, ఆశవానిపాలెం, ఐటీఐ జంక్షన్ సచివాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నీ పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది సోమవారం ఉదయం 7గంటల నుంచి ప్రారంభం కానున్న పోలింగ్ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

అక్కయ్యపాలెం పరిధిలో..

అక్కయ్యపాలెం: ఉత్తర నియోజకవర్గం పరిధి గ్రేటర్ 26, 42, 43, 44, 45, 46వ వార్డుల్లో సోమవారం జరిగే ఎన్నికల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ వార్డులకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు సిద్ధం చేశారు. ఇప్పటికే పోలింగ్ అధికారులు కేంద్రాలకు చేరుకున్నారు. 26వ వార్డులో 21 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 42వ వార్డులో 5 పోలింగ్ కేంద్రాలు, 9 పోలింగ్ బూత్‌లు, 10,300 మంది ఓటర్లు ఉన్నారు. 44వ వార్డులోబూత్‌లు 17 ఏర్పాటుచేయగా, 17500 మంది ఓటర్లు ఉన్నారు. 45వ వార్డులో 9వేల మంది ఓటర్లు ఉండగా, 11 పోలింగ్ బూత్‌లున్నాయి. 46వ వార్డులో 3 పో లింగ్ కేంద్రాలు, 11 బూత్‌లు, 13990 మంది ఓటర్లు ఉన్నారు.

దక్షిణ నియోజకవర్గంలో....

గ్రేటర్ 27వ వార్డులో 5 పోలింగ్ కేంద్రాలు, 18 బూత్‌లు, 16 వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారు 42వ వార్డులో 11 బూత్‌లు, 14 వేల మంది ఓ టర్లు ఉన్నారు.

సీతమ్మధార పరిధిలో..


నక్కవానిపాలెం పాఠశాలలో ఓటర్ల జాబితాలు పరిచూసుకుంటున్న ఉద్యోగులు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి డి.అఖిల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. సోమవారం ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వీలుగా వసతులు సమకూర్చారు. సీతమ్మధార వీఅండ్‌టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్ లో, నక్కవానిపాలెం, మద్దిలపాలెం జీవీఎంసీ స్కూల్, సీతంపేట మధురానగర్ స్కూల్ త దితర స్కూల్స్‌లో పోలింగ్ బూత్‌ల్లో విధులు నిర్వహించే సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు వీలుగా సామగ్రిని ఆదివారం తరలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులకు ముమ్మరంగా బం దోబస్తు ఏర్పాటు చేశారు.

51, 49వ వార్డుల పరిధిలో..

మురళీనగర్; మాధవధార, మురళీనగర్, ఎస్‌జీజీఓస్ కాలనీల్లోని పోలింగ్ కేం ద్రాలను అధికారులు సిద్ధం చేశారు. 51వవార్డు పరిధిలోని 17 పోలింగ్ బూత్‌లను ఆర్డీవో కార్యాలయం, ఆర్అండ్‌బీ ఆఫీసు, జీఎస్ఐ కార్యాలయంలో రెడీ చేశారు. మాధవధార ఉడాకాలనీ కమ్యూనిటీ హాలులో తాత్కాలిక పార్టిషన్లతో కేం ద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల


మాధవధారలో పోలింగ్ క్యాబిన్‌లో సీసీ కెమెరాలు, ఇతరత్రా ఏర్పాట్లు

నీడ, తాగునీరు, ఓటర్లు వేచి ఉండేలా టెంట్లను జీవీఎంసీ అధికారులు, వార్డు సచివాలయ ఎమినిటీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 49వవార్డులో ఊర్వశి జంక్షన్ పాలిటెక్నిక్ కాలేజీ, బర్మాక్యాంప్ జీవీఎంసీ స్కూల్స్, కమ్యూనిటీ హాల్స్‌లో పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు.ఉదయం 5;30 గంటలకు మాక్ పోలింగ్ తర్వాత 7 గంటల నుంచి ఓటర్ల తీర్పుని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు.

ఓటర్లకు డబ్బు పంపిణీలో గలాటాలు

- వన్‌టౌన్ పరిధిలో వైసీపీ నాయకులతో వాగ్వాదాలు

జగదాంబ కూడలి, మే 12: ఓటర్లకు నగదు పంపిణీలో దక్షిణ నియోజవర్గంలో వైసీపీ వార్డుస్థాయి నాయకులతీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఓటర్ జాబితాల్లో పేర్లు ఉన్న వారికీ నాయకులు ఆ పార్టీ అధిష్ఠానం, అభ్యర్థి పంపిణీకోసం ఇచ్చిన డబ్బును అందించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఇంట్లో పది మంది ఓటర్లు ఉంటే ఒక్కరిద్దరికి మాత్రమే డబ్బులు అందించి మిగతా సొమ్మును గోల్‌మాల్ చేశారని పలువురు చెబుతున్నారు. జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ వరకు ఉన్న ప్రధాన వార్డుల్లో వైసీపీ వార్డు నాయకులు, జీవీఎంసీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఓటర్లకు ఇవ్వాల్సిన సొమ్ము కాజేయడంతో తాము వైసీపీకి ఓటేసిదిలేదని బహిరంగంగానే చెబుతుండడం గమనార్హం. అనేక వార్డుల్లో ఓటర్ల నగదు చెల్లింపు లో లోపాలు పోలింగ్‌లో అధికార పార్టీ అభ్యర్థిపై ప్రభావం చూపుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

47వ వార్డులో నాయకుల ఇళ్ల ముట్టడి


కప్పరాడలో టీడీపీ అధ్యక్షుడి ఇంటి వద్ద గుమిగూడిన ఓటర్లు

అక్కయ్యపాలెం, మే 12: గ్రేటర్ 47వ వార్డు రాంజీఎస్టేట్, కప్పరాడ ప్రాంతాల్లో తమకు ఎన్నికలకు సంబంధించిన నగదు పంపిణీ చేయలేదని వార్డు టీడీపీ అధ్యక్షుడు చెంగల శ్రీనుబాబు, బీజేపీ అధ్యక్షుడు గునుపూడి అరుణ్‌కుమార్‌ల ఇళ్లను ఓటర్లు ఆదివారం రాత్రి చుట్టుముట్టారు. కొంతమందికి నగదు ఇచ్చి తమకు ఇవ్వకపోవడంపై వారిని నిలదీశారు. డబ్బులు అందరికీ ఇవ్వకుంటే సమస్యలేదని, కానీ కొంతమందికిచ్చి తమకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం వచ్చినా తాము వివిధ రకాల పన్నులు చెల్లించాల్సిందేనని చెప్పారు. ఎన్నికల్లో మాత్రమే ఓట్లు వేసేందుకు నగదు పంపిణీ చేస్తున్నారని, అదీ కూడా కొంతమంది దళారులు తమకు అందనివ్వకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఇలా అయితే తమ ఓటు ఎవరికి వేయాలో తామే నిర్ణయించుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై ఆయా పార్టీల నాయకులు స్పందించి అందరికీ అందేలా చూడాలని కోరారు.

శాంతిపురంలో వైసీపీ నేత ఇంటి వద్ద...


శ్యామ్ అప్పార్ట్‌మెంట్‌లో వైసీపీ మహిళా నేత ఇంటి ఎదుట మహిళలు

అక్కయ్యపాలెం: ఈ ఎన్నికల్లో డబ్బులు పం పిణీ జోరుగా సాగుతోంది. గ్రేటర్ 26వ వార్డు శాం తిపురంలోని శ్యామ్ అపార్ట్‌మెంట్ వద్ద వైసీపీ మహిళా నాయకురాలు, తాజా కార్పొరేటర్ అభ్యర్థి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఆది వారం రాత్రి నగదు పంపిణీ చేశారు. అక్కడ ఓటర్లు క్యూ కట్టడంతో తమకు ఇబ్బంది కలిగిందని పలువురు చెబుతున్నారు.

రూ.1.14 లక్షలు స్వాధీనం

సీతంపేట: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో ఓటర్లకు డబ్బులు పంచుతున్నట్టు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు దా డిచేసి రూ. 1.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్స్‌లో అభయంజనేయ స్వామి ఆలయం సమీపంలో కూ టమి అభ్యర్థికి సంబంధించిన నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్సు పోలీసులు అ దుపులో తీసుకున్నారు. అ నంతరం వారిని తనిఖీ చేయగా, రూ.1.14 లక్షలు, ఓటర్ జాబితా లభించింది. దీంతో వారిని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఇదే క్రమంలో అధికార పార్టీకి చెందిన వ్యక్తుల వద్ద కూడా డబ్బు లభించినప్పటికీ వారిని అధికార బలంతో తప్పించినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రూ. 2 లక్షలు స్వాధీనం

సీతంపేట శాంతినగరంలో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం రా త్రి అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి రూ.2 లక్షలు, ఓటరు లిస్టులు స్వాధీనం చేస్తున్నారు.

ఎన్‌ఏడీ ఫ్లైవోవర్‌పై ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- ఫ్లైవోవర్ పైనుంచి కిందకు పడిపోయిన యువకులు
- ఇద్దరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


పవన్‌కుమార్, తానవరపు కుమార్ (ఫైల్)

మర్రిపాలెం (విశాఖపట్నం), మే 12: మితిమీరిన వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ పై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...విశాఖ నగరంలోని దొండపర్తి, కంచరపాలెం ప్రాంతాలకు చెందిన అరెల్లి పవన్‌కుమార్ (23), తానవరపు కుమార్ (24), గాంధీ (22) గాజువాక నుంచి ద్విచక్ర వాహనంపై ఆది వారం తెల్లవారుజామున నగరంలోకి వస్తున్నారు. వీరి బైక్ ఎన్‌ఏడీ ఫ్లైవోవర్ పైకి వచ్చేసరికి అదుపుతప్పి నేరుగా రోటరీ డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు ఫ్లైవోవర్ పైనుంచి కిందనున్న రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆరెల్లి పవన్‌కుమార్ (23) తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోని మృతిచెందగా, తానవరపు కుమార్, గాంధీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తక్షణం స్పందించి 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించగా కొద్దిసేపటికే తానవరపు కుమార్ మృతిచెందాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో గాంధీ చికిత్స పొందుతున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్భయంగా ఓటు వేయండి: సీపీ


కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖ పట్నం, మే 12 (ఆంధ్ర జ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలింగ్‌కేంద్రాల వద్ద పరిస్థితిని నిరంతరం ప్రత్యక్ష ప ర్యవేక్షణ చేస్తామని సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ తెలిపారు. కమిషనరేట్‌లోని ఆధునికీకరించిన కమాండ్‌కంట్రోల్‌రూమ్‌లో ఎన్నికల సరళి పరిశీలనకు చేసిన ఏర్పాట్లను ఆదివారం ఆయన మీడియాకు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామన్నారు. పోలీస్ సిబ్బంది, అధికారులకు అందజేసిన బాడీవార్న్‌కెమెరాల నుంచి కూడా అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా వీక్షిస్తామన్నారు. అధికారులు వాడే వాహనాలు, సెల్‌ఫోన్లు, బాడీవార్న్‌కెమెరాలకు జీపీఎస్ అనుసంధానం చేయడంతో వారెక్కడ తిరుగుతున్నారు, ఏం చేస్తున్నారు, కేటాయించిన ప్రదేశంలో విధులు నిర్వర్తిస్తున్నారా? లేదా? వంటి వివరాలన్నీ ఎప్పటికప్పుడు తెలిసిపోతాయన్నారు. దీంతో ఎక్కడైనా అవాంఛనీయ సంఘనలు చర్యలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా డయల్ 100 లేదా, 112కి కాల్‌చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటుకు వేళాయె

... 5వ పేజీ తరువాయి

ఏఆర్వోలు, 21 మంది నోడల్ అధికారులను నియమించగా, జిల్లాను 152 సెక్టార్లుగా విభజించి 207 రూట్లు ఏర్పాటుచేశారు. జిల్లాలో 502 క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాలు గుర్తించిన అధికారులు, అక్కడ పూర్తిగా, మొత్తం 75 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేశారు.

మహిళలే కీలకపాత్ర

జిల్లాలో మొత్తం 20,12,373 మంది ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 10,19,487 మంది (50.66 శాతం ఉన్నారు). ఏడు అసెంబ్లీ స్థానాల్లో గాజువాక తప్ప మిగిలిన అసెంబ్లీ స్థానాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అత్యధికంగా విశాఖ తూర్పులో 51.21 శాతం మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు 97 వేల మంది ఉండగా...వారిలో సుమారు 49 వేల మంది ఓటు నమోదుచేసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయంతో తొలిసారిగా ప్రభుత్వ ఉద్యోగులు 18 వేల మంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు.

భారీ బందోబస్తు

గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు జిల్లాలో 502 క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాల్లో సివిల్ పోలీసులతోపాటు కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 5,023 మంది పోలీసులను నియమించారు. సివిల్ పోలీసులు 3,023, స్పెషల్ పోలీసులు 100 మంది, ఒక ప్లాటూన్, కేంద్ర పారామిలటరీ బలగాలు పది కంపెనీలు 1000 మందితోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రిటైర్డు పోలీసులు, మాజీ సైనికులు మరో 900 మంది వరకూ ఉన్నారు. ప్రతి కేంద్రంలో విధుల్లో ఉన్న పోలీసుల సెల్‌ఫోన్లు, బాడీకెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. ఇప్పటికే రౌడీషీటర్లు, వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి బైండోవరు చేశారు.

11 మోడల్ పోలింగ్ స్టేషన్లు

జిల్లాలో ఈ పర్యాయం 11 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మహిళా ఉద్యోగులు విధులు నిర్వహించేలా ఏడు, యువత, విభిన్న ప్రతిభావంతులు విధులు నిర్వహించేలా చెరో రెండు కేంద్రాలు ఏర్పాటుచేశారు. కాగా జిల్లాలో సుమారు ఎనిమిది వేల మంది దివ్యాంగ ఓటర్లు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రంలో బ్రెయిలీ లిపిలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో కూడిన బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుతారు. వీటి ఆధారంగా ఈవీఎం మిషన్ దగ్గరకు సహాయకుని సాయంతో వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటారు.

విశాఖ ఓటర్లు ఎవరి వైపు?

... 5వ పేజీ తరువాయి

భూముల పరిరక్షణ, ఐటీ, పర్యాటక రంగాల అభివృద్ధి, మోడల్‌గా విశాఖ పార్లమెంటు అభివృద్ధి వంటి హామీలు ఇచ్చారు. ఈ ప్రాంత సమస్యలను బలంగా వినిపిస్తానని నమ్మకం కలిగించారు. నగరంలోని అన్ని వర్గాలు ఆయన మాటలను విశ్వసిస్తున్నాయి. ఈసారి బీజేపీ, జనసేన కూడా తోడు కావడంతో బలం మరింత పెరిగింది. ఇక వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి పార్టీ బలంపైనే ఆధారపడ్డారు. ఆమె విజయనగరం జిల్లా నుంచి గతంలో ఎంపీగా గెలిచినా విశాఖ ప్రజలకు పెద్దగా తెలియదు. తన గళాన్ని కూడా అందరికీ వినిపించలేకపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక విశాఖలో పెరిగిన భూ దందాలు, ప్రాజెక్టుల హస్తగతం, పర్యాటక ప్రాజెక్టుల విధ్వంసం, నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీల పెంపు, ఆస్తి పన్ను పెంపు, చెత్త పన్ను విధింపు...ఇవన్నీ వైసీపీపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయి. పారిశ్రామిక, వ్యాపార, ఉద్యోగ వర్గాలు ఏవీ వైసీపీని కోరుకోవడం లేదు. శ్రీభరత్ భారీ మెజారిటీతో గెలుస్తారనే విశ్వాసం కూటమిలో వ్యక్తమవుతోంది.

తూర్పున ఉదయించే సూరీడు ఎవరో?

తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు నాలుగోసారి గెలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. అక్కడ ఆయన్ను పడగొట్టడమే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐదేళ్లుగా పని చేస్తున్నాయి. వైసీపీ సమన్వయకర్తలుగా పనిచేసిన వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్, అక్కరమాని విజయనిర్మల కూటమిలోకి వచ్చేశారు. ఈ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైనప్పటి నుంచి విస్తృతంగా పర్యటిస్తున్నారు. డబ్బులు కూడా విపరీతంగా ఖర్చు చేశారు. ఒక్క ఫోన్ కాల్ దూరంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన ప్రచారం చేస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

పశ్చిమలో నువ్వా..నేనా?

పశ్చిమ నియోజకవర్గంలో పోటీ నువ్వా?, నేనా? అన్నట్టుగా జరుగుతోంది. టీడీపీ అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు, వైసీపీ తరఫున ఆడారి ఆనంద్‌కుమార్ పోటీ పడుతున్నారు. గణబాబు ఈసారి కూడా గెలిస్తే హ్యాట్రిక్ సాధించినట్టు అవుతుంది. ఆయనకు నియోజకవర్గంలో అన్ని సమస్యలపైన అవగాహన, వాటిని సాధించుకునే నేర్పు ఉంది. వైసీపీ అభ్యర్థి ఆనంద్‌కుమార్ గతంలో తెలుగుదేశం పార్టీలో ఉండేవారు. 2019 ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ తరువాత వైసీపీలో చేరిన ఆయన్ను అధిష్ఠానం పశ్చిమ ఇన్‌చార్జిగా నియమించింది. అప్పటినుంచి ఆయన నియోజక వర్గంలో పర్యటిస్తూనే ఉన్నారు.

ఉత్తరంలో రాజుల మధ్యే యుద్ధం

ఉత్తర నియోజకవర్గంలో కూటమి తరఫున విష్ణుకుమార్‌రాజు పోటీ చేస్తున్నారు. ఆయన 2014 ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. గత ఎన్నికల్లో ఏ పార్టీ సహకారం లేకపోవడంతో బీజేపీ ఓట్లనే సాధించగలిగారు. ఈసారి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అటు టీడీపీ, ఇటు జనసేన సహకరిస్తున్నాయి. అయితే వైసీపీ తరఫున పోటీలో ఉన్న కేకే రాజు గట్టి పోటీ ఇస్తున్నారు. కేకే రాజు గత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో గంటా చేతిలో ఓడిపోయారు. అయినా ఈ ఐదేళ్లు ఆయనే ఎమ్మెల్యేగా చలామణి అయ్యారు. ఇక్కడ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ జరుగుతోంది. ఇక్కడ జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ పోటీ చేస్తున్నారు. ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

దక్షిణంలో మారిన గాలి

దక్షిణ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా జనసేన నుంచి వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ పోటీ చేస్తున్నారు. ఆయన ఇటీవలె జనసేనలో చేరారు. బలమైనా యాదవ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. అక్కడ టీడీపీ నుంచి పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ బాగా సహకరిస్తున్నారు. వంశీ మొదట్లో కొంత వెనకబడి ఉన్నా ఆ తరువాత స్పీడ్ అందుకొని దూసుకుపోయారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ పోటీలో ఉన్నారు. కార్పొరేటర్లతో విభేదాలు, వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత..తదితరాలు ఆయనకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందంటున్నారు.

గాజువాకలో పల్లా హవా

గాజువాక నియోజకవర్గంలో టీడీపీ తరఫున పల్లా శ్రీనివాసరావు పోటీ పడుతుండగా, వైసీపీ నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బరిలో దిగారు. పల్లా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి అండగా ఉన్నారు. కార్మికులు ఆయన్ను విశ్వసిస్తున్నారు. గతంలో కూడా ఆయన గాజువాక నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ఉన్నారు. ఇక వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మంత్రిగా ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదనే విమర్శ ఉంది. పవన్ కల్యాణ్‌పై ఇష్టారాజ్యంగా విమర్శలు చేయడంతో సొంత సామాజిక వర్గం నుంచి కూడా సహకారం లేదంటున్నారు.

భీమిలి మిత్రుల మధ్య వార్

భీమిలి నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు మాజీ మంత్రులు పోటీ పడుతున్నారు. ఒకరు సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు కాగా మరొకరు గంటా శ్రీనివాసరావు. ఇద్దరూ ఒకప్పుడు మిత్రులు. ఒకే పార్టీలో చాలాకాలం కలసి పనిచేశారు. ఐదేళ్ల నుంచి వేర్వేరు పార్టీల్లో కొనసాగుతున్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు, మంచితనం గెలిపిస్తాయని అవంతి చెబుతుంటే..తన విజయం ఖాయమైపోయిందని గంటా శ్రీనివాసరావు అంటున్నారు. భీమిలి ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

పెందుర్తిలో..

పెందుర్తి వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ప్రత్యర్థిగా జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు పోటీలో ఉన్నారు. అదీప్‌రాజ్ ఈ ఐదేళ్లలో భూ దందాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు కూటమి మేనిఫెస్టోకు ప్రజలు ఆకర్షితులు కావడంతో పంచకర్ల రమేశ్‌బాబుకు కలిసొస్తుందని అనుకుంటున్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం ఓటర్ల ఫీట్లు

- ఎన్నికల విధులకు 543 బస్సుల తరలింపు
- కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పడిగాపులు
- స్వస్థలాలకు వెళ్లేవారికి తప్పని అగచాట్లు


బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటుహక్కు వినియోగించుకునేందుకు స్వస్థలాలకు వెళ్లేవారికి ఆర్టీసీ అధికారులు చుక్కలు చూపించారు. బస్సులన్నింటినీ ఎన్నికల విధులకు కేటాయించడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సినవారంతా బస్సుల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గుంటూరు, విజయవాడ వంటి దూరప్రాంతాల్లో ఉంటున్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందినవారంతా సోమవారం జరిగే పోలింగ్‌లో తమ ఓటుహక్కుని స్వస్థలంలో వినియోగించుకునేందుకు రైళ్లలో సోమవారం ఉదయానికి నగరానికి చే రుకున్నారు. నగరం నుంచి బస్సుల్లో స్వస్థలాలకు వెళ్లేందుకు ద్వారకాబస్‌స్టేషన్‌కు వచ్చారు. వీరితో పాటు నగరంలో ఉంటూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఓటు హక్కు ఉన్నవారు స్వస్థలాలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం బయలుదేరారు. బస్సులు లేక గంటల తరబడి వేచి వుండాల్సి వచ్చింది. ఏ దైనా బస్సు వస్తే ఎక్కేందుకు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థి తి నెలకొంది. జిల్లాలోని మధురవాడ, మద్దిలపాలెం, విశాఖపట్నం, వాల్తేరు, గాజువాక, స్టీల్‌సిటీ, కూర్మన్నపాలెంలో డిపోల్లో 804 బస్సులున్నాయి. వీటిలో 543 బస్సులను ఎన్నికల విధులకు కేటాయించారు. మిగిలిన 261 బస్సుల్లో 20 బస్సులను ఎన్నికల విధులకు స్పేర్‌గా ఉంచారు. మరో 11 బస్సులను నగర పరిధిలో అత్యవసర పరిస్థితులు తలెత్తితే వినియోగించేందుకు కేటాయించారు. ఇవన్నీ పోగా మిగిలిన 230 బస్సులు మాత్రమే శ్రీకాకుళం, విజయనగరం, సాలూరు, పార్వతీపురం, ఇచ్ఛాపురం, రాజాం, అనకాపల్లి, నర్సీపట్నంతోపాటు రాజమండ్రి, కాకినాడ, హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు వంటి దూరప్రాంతాలకు నడిపారు. దీనివల్ల సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు బస్సుల కోసం పిల్లలు, లగేజీతో కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిం చాల్సి వచ్చింది.

రెట్టింపు చార్జీలు వసూలు చేసిన ప్రైవేటు ఆపరేటర్లు

కొంతమంది వేచివుండలేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఒకేసారి డిమాండ్ పెరగడంతో ప్రైవేటు ఆపరేటర్లు రెట్టింపు చార్జీలను వసూలు చేశారు. అంతమొత్తం వెచ్చించి వెళ్లలేనివారు కాంప్లెక్స్‌లోనే ఎదురుచూశారు. బస్సు వచ్చిందంటే చాలు ఫ్లాట్‌ఫాం మీదకి రాకముందే పరుగెత్తుకుంటూ వెళ్లి సీట్ల కోసం పోటీపడ్డారు. కొందరైతే పిల్లలను బస్సు కిటికీల నుంచి లోపలకు పంపించి సీట్ రిజర్వు చేసుకోవడం కనిపించింది. శ్రీకాకుళం, విజయనగరం, నర్సీపట్నం వెళ్లేందుకు ప్రయాణికులు బారులు తీరడంతో రిజర్వేషన్ కౌంటర్ల వద్ద రద్దీ కొనసాగింది. ఆర్టీసీ అధికారులతో కలసి ఓటు హక్కువినియోగించుకోకుండా తమనుఅడ్డుకునేందుకే వైసీపీ నేతలు కుట్ర చేశారని కొందరు ఆరోపించడం విశేషం.

ప్రేమ సమాజానికి వితరణ

డాబాగార్డెన్స్, మే 12: ఐటీసీ గ్లోబల్, ఆర్ఆర్‌టీం వార్షికోత్సవాన్ని డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలోని అనాథ బాలబాలికల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ప్రేమ సమాజం అధ్యక్షులు బుద్ధ శివాజీ, నిర్మాత పీఎస్ తిలక్, కోశాధికారి గుప్తా, ఐటీసీ గ్లోబల్ ఫౌండర్ డా.రతన్‌రాజ్, డి.లాజరస్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం ప్రేమ సమాజానికి ఫ్యాన్స్, ఎల్ఈడీ బల్బులు వితరణగా అందజేశారు.

ఓటు వేయడానికి సింగపూర్ నుంచి రాక



ఎండాడ, మే 12 : జీవీఎంసీ 8వ వార్డుకు చెందిన సందీప్ కిరణ్ ఉద్యోగ రీత్యా సింగపూర్‌లో ఉంటున్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఓటు వేయడానికి ఆయన సింగపూర్ నుంచి వచ్చారు. సింగపూర్‌లో ఓటు వేయకపోతే ఓటరు జాబితా నుంచి పేరు తొలగిస్తారు. కారణాలను పూర్తి ఆధారాలతో. పెద్దల సంతకంతో అందిస్తేనే ఓటు హక్కును పునరుద్ధరిస్తారు. అటువంటి వ్యవస్థను భారత్‌లోనూ అమలు చేస్తే ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ముగిసిన తిరునక్షత్ర పూజలు

సింహాచలం, మే 12 : విశిష్టాద్వైత మత స్థాపకులు, తత్వవేత్త రామానుజాచార్యులు 1007వ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవళంలో ఆదివారం రాత్రి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని ఒక వేదికపై, స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజాస్వామిని ఉభయదేవేరులతో మరో వేదికపై అధిష్ఠింపజేసి షోడశోపచారాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.ఈనెల 8 నుంచి ప్రారంభమైన తిరు నక్షత్ర పూజలు ఆదివారం రాత్రి జరిగిన చాత్తు విన్నపాలతో పూర్తయ్యాయి. ఉత్సవంలో భాగంగా బేడామండప తిరువీధి జరిపారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ రామానుజాచార్యుల ప్రవచనాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం భగద్విషయం పండితులు సాతులూరి సూర్యనారాయణాచార్యులు, నిత్య అధ్యాపకులు ఎన్కే బీకే రామానుజం, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి సనాతన ధర్మ బోధకుల సమావేశం

సాగర్‌నగర్, మే 12 : సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు ప్రపంచ సనాతన ధర్మ బోధకుల సమావేశం జరగనున్నట్టు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ యువజన మండలి (ఐబివైసీ) ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సమావేశాలకు సనాతన ధర్మాన్ని బోధిస్తున్న సుమారు 200 మంది ఆధ్యాత్మిక యువ నాయకులు, వరిష్టసన్యాసులు హాజరుకానున్నట్టు చెప్పారు. వారి ఆధ్యాత్మిక జీవితాలు, సనాతన ధర్మ ప్రచార విశేషాలు గురించి మూడు రోజులు పాటు ప్రవచనాలు చేయనున్నారు. ఈమేరకు పూజా కార్యక్రమాలు ఉదయం 4.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 9 గంటలకు ముగియనున్నట్టు ఆయన తెలిపారు.

అప్పన్న భక్తులకు రవాణా కష్టాలు

సింహాచలం, మే 12 : సింహాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను ఎన్నికల సిబ్బంది తరలింపునకు కేటాయించడంతో అప్పన్న భక్తులు ఇబ్బంది పడ్డారు. రెండు బస్సులను మాత్రమే సింహగిరిపైకి షటిల్ సర్వీసులుగా నడిపారు. బస్సుల లేకపోవడంతో భక్తులు రాకపోకలకు దేవస్థానానికి చెందిన నాలుగు బస్సులపై ఆధారపడాల్సి రావడంతో చాలా సమయాన్ని వెచ్చించాల్సి వచ్చింది.అలాగే సింహాచలం నుంచి ఇటు నగరంలోకి, అటు రెడ్డిపల్లి మీదుగా విజయనగరం వెళ్లాల్సిన వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళం

సింహాచలం, మే 12 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన బుర్ర తారక రామారావు ఆదివారం రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తికి అందజేశారు.

సింహగిరిపై భారీ వర్షం



సింహాచలం, మే 12 : సింహగిరిపై ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. 9 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్ముకుని సుమారు గంట పాటు వర్షం పడింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కాగా ఇన్నాళ్లూ వేసవి తాపంతో అల్లాడిన సింహగిరివాసులు వర్షంతో ఉపశమనం పొందారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 23, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 26, క్యారేట్ 36, దొండకాయలు 27, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 150, బరబటి 46, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 98, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వె ల్లుల్లి (పెద్దవి) 185, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 44, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 66, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	133
ఫారం ధర	--	153
విత్ స్కిన్	--	276
స్కిన్‌లెస్	--	286


అళ్వార్‌దాస్ స్కూలు బూత్ లోపల ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది


ఏయూలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో భీమిలి పోలింగ్ సిబ్బంది


ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద ఓటరు స్లిప్పులు చూస్తున్న శ్రీభరత్

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఏక్ దిన్ కా సుల్తాన్

- తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఇప్పటికే కేంద్రాలకు సిబ్బంది చేరిక
- ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం
- కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బంది లేకుండా కనీస సౌకర్యాలు ఏర్పాటు

తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించారు. ఆదివారం సాయంత్రానికే ఎన్నికల సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకుని విధుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా నేడు ఓటరు ఇచ్చే తీర్పుపైనే అభ్యర్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం ఎక్కువగా జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పద్మనాభం : మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఓటర్ల నిరీక్షణ కోసం ప్రతి కేంద్రం వద్ద టెంట్లు వేశారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రతి కేంద్రానికి 12 మంది చొప్పున 540 మంది సిబ్బందిని నియమించారు.వీరితో పాటు శాంతి భద్రతల పరిరక్షణ, ఎన్నికల బందోబస్తు కోసం ఒక ఏసీపీ, ఇద్దరు సీఐలతో పాటు 140 మంది పోలీసులను కేటాయించారు. ఎన్నికల కోసం కేటాయించిన సిబ్బంది ఇప్పటికే ఆయా కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో పాటు చేరుకున్నారు. వారికి తహసీల్దారు వెంకటరావుతో పాటు సీఐ భోజన ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రాన్ని సీఐ శ్రీధర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి స్థానిక పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. కేంద్రాల సమీపంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఎవరైనా గొడవలు సృష్టిస్తే తక్షణమే సమాచారం ఇవ్వడానికి పోలీసుల వద్ద కెమెరాలను ఉంచారు.

15, 16 వార్డుల్లో..

వెంకోజీపాలెం : జీవీఎంసీ పరిధిలోని 15, 16 వార్డుల్లో అధికారులు 36 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. కేంద్రాల వద్ద సామియానా వేసి, ఎండల్లో ఓటర్లు నిలబడి అవస్థలు పడకుండా తగిన ఏర్పాటు చేశారు. మంచినీటి డ్రమ్ములు, వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. 15వ వార్డులో 16 బూత్‌లకు గాను 17000 మంది ఓట్లు ఉన్నారు. 16వ వార్డులో 20 బూత్‌లకు 20 వేల మంది ఓటర్లు ఉన్నారు.

98వ వార్డులో 16 కేంద్రాలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులో 14,400 మంది ఓటర్లకు 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అడివివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1700 మంది, కాపు వీధిలోని ఇందిరా ప్రియదర్శిని కల్యాణ మండపంలో 999 మంది ఓటు వేయనున్నారు. అలాగే పాతఅడివివరం ఎంపీపీ స్కూల్‌లో 2500 మంది, ఏఎంజీ వ్యాలీ ఆఫ్ లవ్‌లో 310, ప్రహ్లాదపురంలోని సింహాచలం దేవస్థానం హౌస్ బిల్డింగ్ సొసైటీ భవనంలో 1195, ప్రహ్లాదపురం సత్యసాయి గెస్ట్‌హౌస్‌లో 557, సింహాచల దేవస్థానం సంస్కృత హైస్కూల్ రూమ్-1లో పీఎస్ నంబరు 232లో 1308, రూమ్-2లో పీఎస్ నంబరు 234లో 691, అదే స్కూల్ అదనపు గదిలో పీఎస్ నంబరు 235లో 604, చాకిరేవు కొండలో ఎంపీపీ స్కూల్‌లో పీఎస్ నంబరు 233లో 834, సింహాచలం మెయిన్ రోడ్డులోని ఎంపీపీ స్కూల్ పీఎస్ నంబర్ 236లో 822, పీఎస్ 237లో 647, పాతగోశాల ఎంపీపీ స్కూల్‌లో పీఎస్ నంబరు 238లో 683 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

తూర్పు నియోజకవర్గంలో 282 కేంద్రాలు

మద్దిలపాలెం, మే 12 : తూర్పు నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్ నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్‌లో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో అధిక శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రతి ఒక్క ఓటరు ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. నియోజకవర్గంలోని 282 పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే పోలింగ్ మెటీరియల్ తరలించారు. నియోజకవర్గంలో 2,92,206 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,42,540, మహిళలు 1,49,646, ఇతరులు 20 మంది ఉన్నారు. నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈసారి పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో 2009లో 68.22, 2014లో 64.88, 2019లో 64.73 శాతం పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 80 శాతం పోలింగ్ జరిగేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికి 70 శాతం నుంచి 74 శాతం వరకు జరిగే అవకాశం ఉంది. అంటే దాదాపు 2 లక్షలకు పైగా ఓటర్లు కొత్తగా ఓటును వినియోగించుకోనున్నారు.

మహిళా ఓటర్లు కీలకం

పద్మనాభం : ఈసారి ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. వారి ఓట్ల ఆధారంగానే అభ్యర్థుల గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. పద్మనాభంలోని 45 పోలింగ్ కేంద్రాల్లో 42145 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.వీరిలో పురుషులు 20624, స్త్రీలు 21521 మంది ఉన్నారు. పురుషుల కంటే 897 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పాండ్రంగి పంచాయతీలో మొత్తం 4404 మంది ఓటర్లు ఉండగా అత్యధిక ఓటర్లు ఉన్న పంచాయతీగా ఇది నిలిచింది. 3636 మంది ఓటర్లతో రెడ్డిపల్లి రెండో పంచాయతీగా నిలిచింది. దీని తరువాత 2724 మంది ఓటర్లతో మద్ది, 2503 మంది ఓటర్లతో బీఆర్ తాళ్లవలస, 2449 మంది ఓటర్లతో కోరాడ, 2436 మంది ఓటర్లతో అనంతవరం, 2194 ఓట్లతో పొట్నూరు, 2056 మంది ఓటర్లతో కొవ్వాడ పంచాయతీలు ఉన్నాయి. ఒక పోలింగు కేంద్రంతో 679 మంది ఓటర్లతో శేరిఖండం అత్యల్ప ఓట్లు ఉన్న పంచాయతీగా ఉంది.

ఆరు సమస్యాత్మక కేంద్రాలు

ఆరిలోవ : ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలిగ్ కేంద్రాలను సీఐ గోవిందరావు ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 200 మీటర్ల పరిధిలో వాహనాలను అనుమతించరాదన్నారు.వీవీపీ వచ్చినపుడు గన్‌మేన్‌లను గన్‌తో అనుమతించ కూడదని తెలిపారు. సీపీ అందించిన కెమేరాలను ఆయన ఎస్ఐకి ఇచ్చి దాన్ని ఎలా ఉపయోగించాలో వివరించారు. కాగా తమ పోలీసుస్టేషన్ పరిధిలో ఆరు సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఏసీపీ రాంబాబు, హోంగార్డు కమెండర్ డీసీపీ ప్రేమజిత్ కూడా ఆరిలోవలోని ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

చురుగ్గా ఏర్పాట్లు

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు బూత్‌లు, వరహగిరినగర్ సచివాలయంలో ఒకటి, ఎండాడ ఎస్సీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ సామాజిక భవనంలో రెండు, గొల్లల ఎండాడ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో మూడు, రుషికొండ ప్రభుత్వ పాఠశాలలో నాలుగు, సాగర్‌నగర్ మేరీ స్టెల్లా స్కూల్‌లో ఐదు, గుడ్లవానిపాలెంలో ఒక బూత్ ఏర్పాటు చేశారు. మొత్తం 17 బూత్‌లతో పాటు అదనంగా మరో నాలుగు బూత్‌లను వినియోగంలోకి తెచ్చారు.21 బూత్‌ల్లో 20 వేలకుపైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే బూత్‌లలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం కేంద్రాల వద్ద దోమల నియంత్రణకు ఫాగ్ మెషీన్‌లను వినియోగించారు. అలాగే 9వ వార్డులోని విశాలాక్షినగర్ ప్రాంతంలో 12 బూత్‌లు ఏర్పాటు చేశారు. సంజీవ్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మూడు, బీవీకే పాఠశాలలో ఆరు, జోడుగుళ్లపాలెం ప్రాంతంలో ఉన్న ట్రైనింగ్ సెంటర్‌లో మూడు బూత్‌లు ఏర్పాటు చేశారు. ఇక్కడ సుమారు 17 వేల మంది ఓటు వేయనున్నారు.

ఎంవీపీ కాలనీ : తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల సమరానికి దాదాపు సన్నాహాలు పూర్తయ్యాయి. పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎండ నుంచి సేద తీరేందుకు టెంట్లు, కొన్నిచోట్ల వర్షం నుంచి రక్షణ కల్పించే టెంట్లు కూడా వేశారు. అలాగే కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు నుంచి ఓట్లు వేసేందుకు ఓటర్లు అధిక సంఖ్యలో వచ్చే అవకాశముందని సిబ్బంది భావిస్తున్నారు. కాగా శనివారంతో ప్రచారం ముగిసిపోయింది. దీంతో అభ్యర్థులు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు. అన్ని సన్నాహాలు పూర్తికావడంతో ఎంవీపీ కాలనీలోని టీడీపీ ఎన్నికల కార్యాలయం వద్ద కూటమి అభ్యర్థి శ్రీభరత్ ప్రశాంతంగా కూర్చుకున్నారు. తన కుటుంబ సభ్యుల ఓటరు స్లిప్పులను చూసుకున్నారు.

కొమ్మాది : చినగదిలి పరిధిలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడ 1,67 లక్షల మంది ఓటర్లకు 152 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల ఓటర్ల కోసం 9 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. సాగర్‌నగర్‌లోని మేరిస్టెల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బూత్‌ల్లో 5 వేల మంది ఓటు వేయనున్నారు.గుడ్లవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 1400 మంది, రుషికొండ వాడపాలెం హైస్కూల్ కేంద్రంలో 4300 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



అతి పెద్ద నియోజకవర్గం భీమిలి

భీమునిపట్నం, మే 12 : రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గం భీమిలి. ఈ సిగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 3,63,013 మంది కాగా పురుషులు 1,78,090, స్త్రీలు 1,84,908, ఇతరులు 15 మంది వున్నారు.మహిళా ఓటర్లు 6,818 మంది అధికంగా వున్నారు. నియోజకవర్గంలోని పద్మనాభం మండలంలో 42,145 మంది, ఆనందపురంలో 51,354, భీమిలిలో 36,586 మంది ఓటర్లు వున్నారు. అలాగే 1వ వార్డులో 15,737, 2వ వార్డులో 16,803, 3వ వార్డులో 15,068, 4వ వార్డులో 18,226, 5వ వార్డులో 33,755,6వ వార్డులో 41,391, 7వ వార్డులో 35,408, 8వ వార్డులో 22,740, 14వ వార్డులో 1,550, 15వ వార్డులో 3,067, 45వ వార్డులో 6,075, 89వ వార్డులో 7,921, 98వ వార్డులో 15,187 మంది ఓటర్లు వున్నారు.

పోలింగ్ బూత్‌లకు చేరిన సిబ్బంది

భీమిలిలో వున్న పోలింగ్ బూత్‌లకు ఆదివారం రాత్రి సిబ్బంది చేరుకున్నారు. ఒక్కొక్క బూత్‌కు పీఓ, ఏపీఓ, నలుగురు పోలింగ్ సిబ్బందిని నియమించారు. అలాగే బూత్‌ల దగ్గర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి సంబంధించి ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వున్న 359 బూత్‌లకు ఎన్నికల సిబ్బందికి ఈవీఎం మిషన్లు, పోలింగ్ సామగ్రి అందజేశారు.


భీమిలిలోని సీబీఎం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో సిబ్బంది


బీఆర్ తాళ్లవలస కేంద్రం వద్ద పరిసరాల పరిశుభ్రత


పాండ్రంగి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్


పద్మనాభం పోలింగు కేంద్రానికి సామగ్రితో వచ్చిన ఎన్నికల సిబ్బంది

చెరువుల్లో పూడికలు

పద్మనాభం (రూరల్), మే 12 : మండలంలో సాగునీటి చెరువుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి పూడికతీతలు, ఆధునీకీకరణ పనులు చేపట్టకపోవడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూడికలు, ముళ్ల పొదలు పెరిగిపోవడం, వ్యర్థాలు నిల్వ ఉండడంతో చెరువుల స్వరూపమే మారిపోయింది. ప్రభుత్వం ఏటా వేసవిలో చెరువుల్లో పూడిక తొలగింపు, కరకట్టలు పటిష్ఠం, తూములు, తలుపుల మరమ్మతు చేయాల్సి ఉంది.కానీ కొన్నేళ్లుగా ఆ పనులేవీ జరగడం లేదు. మండలంలో సుమారు 58 చెరువులు ఉండగా అన్నీ వర్షాధారంతో నీరు నిల్వ ఉండి పంటలకు సాగునీరు అందిస్తుంటాయి. ఏళ్ల తరబడి నిర్వహణ పనులు లేకపోవడంతో చెరువుల్లో నీరు కూడా తక్కువగా ఉంటోంది.చెరువుల కింద ఉన్న కాలువలు కూడా అధ్వానంగా ఉన్నాయి. పూడిక, తుప్పలతో నిండిపోయి గట్లు పలుచోట్ల ధ్వంసమయ్యాయి. దీంతో కొన్ని గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేయలేక బీడుగా వదిలేశారు. వీటికితోడు అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి.


పూడికతీతకు నోచుకోని అనంతవరంలోని కాటమయ్య చెరువు

తుప్పు పట్టిన ఆట వస్తువులు

- రుషికొండ బీచ్ పార్కులో దుస్థితి


పార్కులో తుప్పు పట్టిన పరికరాలు



సాగర్‌నగర్, మే 12 : రుషికొండ బీచ్‌లో కోస్టల్ కారిడార్ పనుల్లో భాగంగా కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు నిరుపయోగంగా మారాయి. ఏడాది క్రితం బీచ్‌లో బోటు షికార్‌కు సమీపంలో చిల్డ్రన్ పార్కు నిర్మించి, చిన్నారుల కోసం పలు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఐరన్‌తో తయారు చేసిన వస్తువులు కావడంతో సముద్రం గాలులకు అవి తుప్పుపట్టి పాడవుతున్నాయి. తీర ప్రాంతంలో ఐరన్ పరికరాలు ఎక్కువ రోజులు ఉండవని తెలిసినా..అధికారులు వాటినే ఏర్పాటు చేశారు. దీంతో పార్కులోని జారుడు బల్లతో పాటు మిగతా ఆట వస్తువులు తుప్పు పడుతున్నాయి. వీటిపై ఆడుతున్న పిల్లలు ఇనుప రేకులు గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. పిల్లలతో బీచ్‌లో సరదాగా గడుపుదామని పార్కుకు వస్తున్న తల్లిదండ్రులు ఆట వస్తువులు అనువుగా లేకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. ఈ బీచ్‌కు శని, ఆదివారాల్లో వందల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. వారి నుంచి పార్కింగ్ ఫీజు, ప్రవేశ రుసుం ముక్కుపిండి మరీ వసూలు చేస్తోన్న పర్యాటక శాఖ పిల్లల ఆట వస్తువుల నిర్వహణపై కనీస శ్రద్ధ చూపకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లేగదూడల సంరక్షణ పట్ల నిర్లక్ష్యం

సింహాచలం, మే 12 : భక్తులు అప్పన్న స్వామికి మొక్కుబడిగా సమర్పించిన లేగ దూడల సంరక్షణ పట్ల దేవస్థానం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమ ఇంట్లో సంతానం కలిగితే అప్పన్నస్వామికి లేగదూడలను మొక్కుబడిగా సమర్పించడం ఉత్తరాంధ్రలోని గ్రామీణ భక్తుల ఆనవాయితీ.ఈమేరకు ప్రతి శని, ఆదివారం అత్యధిక సంఖ్యలోనూ, మిగిలిన రోజుల్లో తక్కువ సంఖ్యలో లేగ దూడలను తీసుకువచ్చి సింహాచలం తొలిపావంచా వద్ద సమర్పించి, వెళ్తుంటారు. గతంలో తొలిపావంచా వద్ద దేవస్థానం ఆధీనంలో లేగ దూడలకు తాటి ఆకుల పూరి పాక నిర్మించి అందులో వాటికి తాగునీరు, ఎండు గడ్డి అందుబాటులో ఉంచేవారు. కొంత కాలంగా వాటికి వసతి సౌకర్యం లేదు సరికదా తాగునీరు, గడ్డి కూడా అందుబాటులో ఉంచడం లేదు. దీంతో అవి ఆకలికి అలమటిస్తూ.. ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్నాయి. మూగజీవాల నిర్వహణ పట్ల దేవస్థానం అధికారుల వైఖరిని భక్తులు తప్పుపడుతున్నారు.


చాలీచాలని వసతితో ఎండలో ఉన్న లేగ దూడలు

బరిలో వీరులు

మరి కొద్ది నిమిషాల్లో సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టం పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి సుమారు 50 రోజులుగా ఎన్నికల సందడి మొదలై, అభ్యర్థుల ఎంపిక తరువాత ఉధృత స్థాయికి చేరుకుంది. ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, ఆశావహులు ఇలా... ఒక్కో పార్టీలో ఎంతో మంది పోటీపడి టికెట్లు దక్కించుకున్నారు. వారితో పాటు స్వతంత్రులు కూడా తమ భవితవ్యం తేల్చుకునేందుకు రంగంలో నిలిచారు. మొత్తమ్మీద ప్రక్రియ పూర్తై... చివరకు పోటీలో నిలిచిన వారిలో విజేతలెవరో సోమవారం ఈవీఎంలలో నిక్షిప్తం కానుంది. జిల్లాలోని పార్లమెంటు నియోజకవర్గాలతో పాటు శాసనసభ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రధాన పోటీదారుల వివరాలు పాఠకుల కోసం...

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



విశాఖ లోక్‌సభ బరిలో 33 మంది



ఎం.శ్రీభరత్ | బొత్స ఝాన్సీ | పి.సత్యారెడ్డి

విశాఖ లోక్‌సభస్థానం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 33 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. తెలుగుదేశం, వైసీపీతో పాటు కాంగ్రెస్, బీఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీ, దళిత బహుజనపార్టీ, పిరమిడ్ పార్టీతో కలిపి 18 మంది, మరో 15 మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. పి.సత్యారెడ్డి (కాంగ్రెస్), పెదపెంకి శివప్రసాదరావు (బీఎస్పీ), ఎ.విజయభాస్కర్ (ఇండియా ప్రజాబంధు), అచ్చుత బాలాజీ యాదవ్ (భారత్ చైతన్య యువజన), కొంగరపు గణపతి (రిపబ్లికన్), జి.జగదీశ్వరరావు (జైమహాభారత్), జి.దుర్గాప్రసాద్ (భారతీయ రాష్ట్రీయ దళ్), జి.రాజేష్ (నవతరం), చింతాడ సూర్య (నవ భారత్ నిర్మాణ), జాలాది విజయ్ (సమాజ్‌వాదీ పార్టీ), టి.సాయిముకుంద (ప్రజాప్రస్థానం), కేఏ పాల్ (ప్రజా శాంతి), బాన్న రమేష్ (దళిత బహుజన పార్టీ), బి.చల మాజీ (నవరంగ కాంగ్రెస్), వీఎస్. సత్యనారాయణ (రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్), పి.సత్యవాణి (పిరమిడ్)తో పాటు మరో 15 మంది స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. కాగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎం.శ్రీభరత్, వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట అసెంబ్లీ స్థానం ఉంది.

అనకాపల్లి ఎంపీకి ద్విముఖ పోరు!



సీఎం రమేశ్ | బూడి ముత్యాలునాయుడు | వేగి వెంకటేశ్

అనకాపల్లి ఎంపీ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచినా ప్రధాన పోరు బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు మధ్యే నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుంచి వేగి వెంకటేశ్ పోటీలో ఉన్నారు. పార్ల మెంట్ పరిధిలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, పెందుర్తి, పాయకరావుపేట అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. కూటమి సీఎం రమేశ్‌ను రంగంలోకి దింపడంతో వైసీపీ అదే సామాజికవర్గానికి చెందిన బూడి ముత్యాలు నాయుడును బరిలో నిలిపింది.

'తూర్పు'లో ముఖాముఖి



వెలగపూడి రామకృష్ణబాబు | ఎంవీవీ సత్యనారాయణ | గుత్తుల శ్రీనివాసరావు

విశాఖ తూర్పు నియోజకవర్గంలో మొత్తం 14మంది పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి విశాఖ లోక్‌సభ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. పోటీలో 15మంది ఉన్నప్పటికీ వెలగపూడి, ఎంవీవీ సత్యనారాయణ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. గుత్తుల శ్రీనివాసరావు(కాంగ్రెస్), జోసఫ్ పీటర్ (బీఎస్పీ), అదపాక దాలిరాజు (నవభారత నిర్మాణ పార్టీ), కె.గణపతి (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), తోట వెంకట సాయి ముకుందు (ప్రజాప్రస్థానం పార్టీ), యడ్ల వేణుగోపాలకృష్ణ (భారతీయ చైతన్య యువజన పార్టీ), ఇ.హైమావతి (పిరమిడ్ పార్టీ), మరో ఐదుగురు ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు.

పెందుర్తిలో నువ్వా... నేనా?



పంచకర్ల రమేశ్‌బాబు | అన్నంరెడ్డి అదీప్‌రాజ్ | పిరిడి భగత్

పెందుర్తి నియోజకవర్గంలో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ, కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు బరిలో ఉన్నారు. వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పోటీ చేస్తున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ నుంచి పిరిడి భగత్, బీఎస్పీ నుంచి బంగారి రమణ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఈత రోజ, నేషనలిస్ట్ జనశక్తి నుంచి ఏలూరు వెంకటరమణ జైభారత్ నేషనల్ పార్టీ నుంచి కన్నేపల్లి మహదేవ్, నవరంగ్ కాంగ్రెస్ నుంచి పి.రమేశ్ నాయుడు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి బోలెం వెంకట మురళీమోహన్, మరో ఐదుగురు స్వతంత్రులుగా బరిలో ఉన్నారు.

'పశ్చిమ' బరిలో 13 మంది



పీజీవీఆర్ నాయుడు (గణబాబు) | ఆడారి ఆనంద్‌కుమార్ | అత్తిలి విమల

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోరు టీడీపీ, వైసీపీ మధ్యే నెలకొంది. ఇక్కడ తెలుగుదేశం పార్టీ (కూటమి) అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) బరిలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థిగా విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పోటీలో ఉన్నారు. కాగా సీపీఐ అభ్యర్థిగా అత్తిలి విమల, బీఎస్పీ నుంచి అతుకుంశెట్టి రామచంద్రరావు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి బొట్టా కోటేశ్వరరావు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి వెంకట గణేశ్ జగ్గుమంత్రి, సమాజ్‌వాద్ పార్టీ నుంచి రవికుమార్ వెలగాడ, జాతీయ జనసేన పార్టీ నుంచి మండపాటి శ్రీనివాసరాజు, మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

'నార్త్'లో ముక్కోణం



విష్ణుకుమార్‌రాజు | కేకే రాజు | వీవీ లక్ష్మీనారాయణ

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో మొత్తం 15 మంది పోటీలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు బరిలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి కేకే రాజు పోటీ చేస్తున్నారు. జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. గడిచిన ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన.. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సొంతంగా పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్.రామారావు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి గుంపుల శరత్‌బాబు, నవభారత్ నిర్మాణ సేవ పార్టీ నుంచి చింతాడ సూర్యం, జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీశ్, మరో ఏడుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

అరకు పార్లమెంట్‌కు త్రిముఖ పోరు



కొత్తపల్లి గీత | తనూజారాణి | పి.అప్పలనర్స

అరకు పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. బరిలో 13 మంది అభ్యర్థులుండగా, ప్రధానంగా కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి తనూజారాణి మధ్య హోరాహోరీ పోటీ సాగుతోంది. ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా బరిలోకి దిగిన పి.అప్పలనర్స గట్టిపోటీ ఇస్తారంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకులోయ, రంపచోడవరం పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ అసెంబ్లీ స్థానాలు నియోజక వర్గం పరిధిలో ఉన్నాయి. మొత్తం 15,54,633 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 7,53,709 మంది, మహిళలు 8,00,813 మంది, ఇతరులు 111 మంది ఉన్నారు. మరో పది మంది ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు.

భీమిలిలో మిత్రుల యుద్ధం



గంటా శ్రీనివాసరావు | ముత్తంశెట్టి శ్రీనివాసరావు | అద్దాల వెంకట వర్మరాజు

భీమిలి నియోజకవర్గంలో మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో చిరకాల మిత్రులు వైసీపీ నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తెలుగుదేశం నుంచి గంటా శ్రీనివాసరావుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఇంకా కాంగ్రెస్ నుంచి అద్దాల వెంకట వర్మరాజు, బీఎస్పీ నుంచి భాగం గోపాలరావు, జై భారత నేషనల్ పార్టీ నుంచి అనిల్‌కుమార్ ఇలిపిల్లి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కోలా హరిబాబు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థిగా రాజు చోడిపల్లి, మరో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

'దక్షిణం'లో రసవత్తర పోరు



వంశీకృష్ణ శ్రీనివాస్ | వాసుపల్లి గణేష్‌కుమార్ | వాసుపల్లి సంతోష్‌కుమార్

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 16 మంది పోటీ చేస్తున్నప్పటికీ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ మధ్య పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకుల అంచనా. వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న వంశీకృష్ణ జనసేన పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో తూర్పు నుంచి వైసీపీ టికెట్టు దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఈ ఎన్నికల్లోనూ టికెట్ కేటాయించకపోవడంతో పార్టీని వీడారు. వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గత ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించి వైసీపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్‌కుమార్, జైభారత్ పార్టీ నుంచి ఎర్రంశెట్టి సురేష్‌కుమార్, బీఎస్పీ నుంచి కదిరిరాము, స్వతంత్ర అభ్యర్థులుగా 11 మంది రంగంలో నిలిచారు.

గాజువాకలో ద్విముఖ పోటీ



పల్లా శ్రీనివాసరావు | గుడివాడ అమర్‌నాథ్ | ఎం.జగ్గు నాయుడు

గాజువాక నియోజకవర్గంలో ద్విముఖ పోటీ నెలకొంది. మొత్తం 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. తెలుగుదేశం పార్టీ (కూటమి) అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇంకా ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా ఎం.జగ్గునాయుడు, ప్రజాశాంతి నుంచి కేఏ పాల్, ఎన్.అప్పారావు (బీఎస్‌పీ), టి.అక్కయ్య (లోకతంత్రిక్ జనతాదళ్), శ్యాముల్ జాన్ ధర్మరాజు రాయపాటి (దళిత బహుజన), తలపుల శైలజ (ప్రజాప్రస్థానం), కాండ్రేగుల ఆదినారాయణ (జై మహాభారత్), బత్తుల నీలకంఠం (నవభారత్ నిర్మాణ సేవ), సుంకర సారజ్యోతి (నవతరం పార్టీ), మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.

భారీగా యువ ఓటర్లు

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతీయువకుల సంఖ్య విశాఖపట్నం జిల్లాలో భారీగానే ఉంది. అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక డ్రైవ్‌ల ఫలితంగా భారీసంఖ్యలో యువత ఓటు హక్కును నమోదు చేయించుకున్నారు. వీరంతా సోమవారం ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 49,935 మంది కొత్తగా ఓటు హక్కును పొందారు. మొత్తం ఓటర్లతో పోలిస్తే వీరి సంఖ్య 2.48 శాతంగా ఉంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే...కొత్త ఓటర్లు భీమిలిలో 9,469 మంది నమోదు కాగా, వీరిలో 5,200 మంది పురుషులు, 4,269 మంది మహిళలు ఉన్నారు. అలాగే విశాఖపట్నం తూర్పు నియోజకవర్గంలో 7,499 మందిలో పురుషులు 3,912 మంది, మహిళలు 3,586 మంది, దక్షిణ నియోజకవర్గంలో 4,479 మందిలో 2,396 మంది పురుషులు, 2,083 మంది మహిళలు, నార్త్ నియోజకవర్గంలో 6,617 మంది కొత్త ఓటర్లు ఉండగా 3,553 మంది పురుషులు, 3,064 మంది మహిళలు, పశ్చిమ నియోజకవర్గంలో 5,437 మందిలో 2,863 మంది పురుషులు, మహిళలు 2,573 మంది ఉన్నారు. గాజువాక నియోజకవర్గంలో 8,408 మంది యువ ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 4,523 మంది, మహిళలు 3,885 మంది, పెందుర్తి నియోజకవర్గంలో 8,026 మందిలో పురుషులు 4,356 మంది, మహిళలు 3,670 మంది ఉన్నారు.



రెండు శాతానికిపైగానే..

విభజిత విశాఖ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ రెండు శాతానికి పైగానే తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో అత్యధికంగా 2.6 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకుంటుండగా, విశాఖ తూర్పులో 2.56 శాతం మంది యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. విశాఖ పశ్చిమలో 2.54 శాతం మంది, గాజువాకలో 2.52 శాతం మంది, విశాఖ ఉత్తరంలో 2.31 శాతం మంది, విశాఖ దక్షిణలో 2.06 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువ ఓటర్లు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 2.48 శాతం మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగం

- జిల్లా వ్యాప్తంగా 20,12,373 మంది ఓటర్లు... వీరిలో 18-19 ఏళ్లలోపు యువతీయువకులు 49,935 మంది
- అత్యధికంగా భీమిలిలో 9,469 మంది, గాజువాకలో 8,408, పెందుర్తిలో 8,026 మంది ఓటర్లు
- 'నార్త్'లో అన్నింటి కంటే తక్కువగా 4,479 మంది

నియోజక వర్గాలు వారీగా వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	తొలి ఓటర్లు	శాతం
భీమిలి	1,78,068	1,84,928	17	9,469	2.6
విశాఖ తూర్పు	1,42,546	1,49,639	21	7,499	2.56
విశాఖ దక్షిణ	1,06,454	1,10,282	34	4,479	2.06
విశాఖ ఉత్తర	1,40,810	1,44,956	23	6,617	2.31
విశాఖ పశ్చిమ	1,05,207	1,08,221	11	5,437	2.54
గాజువాక	1,67,125	1,66,473	13	8,408	2.52
పెందుర్తి	1,52,592	1,54,948	05	8,026	2.6

ఎన్నికల సందడి

- ఏయూలో పోలింగ్ సామగ్రి పంపిణీ
- అసెంబ్లీ స్థానాల వారీగా కౌంటర్లు
- 847 బస్సుల్లో సిబ్బంది తరలింపు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఎన్నికల సిబ్బంది హడావుడి

విశాఖపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న పోలింగ్‌కు అవసరమైన సామగ్రి పంపిణీ పూర్తిచేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రిసెప్షన్ సెంటరు అందుబాటులో ఉంచారు. జిల్లాలో 1,991 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఓటరు జాబితా, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఇందుకోసం ఆదివారం తెల్లవారుజాము నుంచే ఎన్నికల అధికారులు, సిబ్బంది సిద్ధమయ్యారు. నియోజకవర్గాల వారీగా సిబ్బంది కోసం షామియానాలు వేసి టేబుళ్లు , కుర్చీలు ఏర్పాటుచేశారు. సామగ్రి తరలింపునకు పెద్దసైజులో సంచులు సిద్ధంచేశారు. సెంటర్ నుంచి బస్సుల్లోకి సామగ్రిని తరలించేందుకు పెద్దఎత్తున కూలీలను నియమించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం 13,076మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ, ప్రైవేటు, స్కూలు బస్సులు 847 వరకు సమకూర్చగా అదనంగా టాటా మేజిక్‌లు అందుబాటులో ఉంచారు. పంపిణీ ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మ, ఏడీసీ విశ్వనాథన్ పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సామగ్రి తీసుకునేందుకు వేలమంది సిబ్బంది ఏయూకు వచ్చి వారి వాహనాలను ఎక్కడికక్కడ పార్కింగ్ చేయడంతో ఉదయం పదిగంటల సమయంలో ట్రాఫిక్‌జామ్‌అయింది. దీంతో పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలావుండగా నగరంలో పోలింగ్ కేంద్రాలకు మధ్యాహ్నంమే సామగ్రి తరలించగా పెందుర్తి, భీమిలి సెగ్మెంట్‌లో చివరి ప్రాంతాలకు సాయంత్రం చేరింది. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీసులు, కేంద్ర బలగాలు మోహరించాయి.



సామగ్రితో బస్సుల వద్దకు చేరుకుంటున్న సిబ్బంది



వాకీ టాకీలు పరిశీలిస్తున్న పోలీసులు



ఎన్నికల సిబ్బందికి ఈవీఎంల పనితీరును వివరిస్తున్న అధికారులు



సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం



పోలింగ్ సామగ్రి తీసుకునేందుకు బారులుతీరిన ఉద్యోగులు



కేంద్రీయ విద్యాలయంలో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది